www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 145 శుక్రవారం, అక్టోబర్ 09, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad






# పేదల ఓట్లు తొలగించే కుట్ర

● ఓటు హక్కు హరణకు బీజేపీ పార్టీ పన్నాగం ● సైమన్ కమిషన్‌లా ఉపయోగించే ప్లాన్ ● మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు ● సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి ● గల్లీ నుంచి ఢిల్లీ వరకూ పోరాటం తప్పదు ● ఢిల్లీ ఇండియా కూటమి నిరసనలో రేవంత్

**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 :** ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని

మిగతా2లో...

# జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు ఉండాలి

- తెలంగాణ ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలి: భట్టి విక్రమార్క



**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 :** జీఎస్టీ సంస్కరణ లను స్వాగతిస్తూనే రాష్ట్రాల ఆదాయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కేంద్రాన్ని కోరారు. 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు.నిజాయితీగా పన్నులు

మిగతా2లో...

# మారుమూల పల్లెలకూ బ్యాంకులు, ఆసుపత్రులు

● టెలికాం రంగంలో సరికొత్త విప్లవం తెచ్చాం ● 'డిజిటల్ ఇండియా'తో టెక్నాలజీ అందుబాటులోకి ● ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు ● ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన మోదీ




**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 :**దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరుగుతున్న 10వ ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ భారత టెలికాం, డిజిటల్ రంగాల ప్రగతిని సమగ్రంగా వివరించారు. కరోనా సంక్షోభ సమయంలోనూ వెనకడుగు వేయకుండా టెలికాం సేవలను గ్రామీణ ప్రాంతాల వరకు బలంగా తీసుకెళ్లామని చెప్పారు. డిజిటల్ కనెక్టివిటీ ఆధారంగానే పల్లెల్లో ఉండే ప్రజల ముంగిటకు బ్యాంకింగ్, వైద్యం సహా కీలకమైన ప్రభుత్వ సేవలను చేర్చడం సాధ్యమైందని స్పష్టం చేశారు. విప్లవాత్మక టెలికాం సంస్కరణల ద్వారా దేశంలో పారదర్శక పాలనను మరింత బలోపేతం చేశామని, పేదలకు అందాల్సిన సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టకుండా కాపాడగలిగామని తెలిపారు. వ్యవస్థల్లో తీసుకొచ్చిన ఈ మార్పులను ఎవరు వ్యతిరేకించినా సంస్కరణల ప్రయాణం ఆగబోదని స్పష్టం

మిగతా2లో...




## ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. రైతులను అణిచివేసే ప్రభుత్వం

- రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు: హరీశ్‌రావు

# వ్యాపారులకు భారీ ఊరట..

● పన్ను అధికారులకు అరెస్ట్ అధికారం రద్దు ● ప్రాసిక్యూషన్ పరిమితి రూ. 5 కోట్లకు పెంపు ● ఇ-కామర్స్ వ్యాపారులకు జరిమానా తగ్గింపు ● ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పై అధ్యయనానికి కమిటీ ● జీఎస్టీ నిభంధనల్లో సంచలన మార్పులు ● జీఎస్టీ రేట్లలో ఊరట.. ఈసారి లేని మార్పులు ● 57వ జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు!




**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 :** జీఎస్టీ కౌన్సిల్ గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించింది. ఈ కౌన్సిల్ ఒక కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, జీఎస్టీ కింద ఎటువంటి అరెస్టులు జరగవు. జీఎస్టీ కింద అరెస్టు చేసే అధికారాన్ని కౌన్సిల్ పూర్తిగా తొలగించింది. అలాగే, ప్రాసిక్యూషన్ పరిమితిని రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచింది. జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన అమలు,

మిగతా2లో...

# 'బిల్డ్ ఏపీ' మా నినాదం

- ఒప్పందాలను వాస్తవ పెట్టుబడులుగా మారుస్తాం
- 22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగాం
- దిగ్గజ సంస్థలు ఏపీలో కార్యకలాపాలకు ముందుకు
- పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో అనుమతులు
- వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో సిఎం చంద్రబాబు




**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 :** 'బిల్డ్ ఏపీ' నినాదంతో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో దేశంలోనే అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు,

మిగతా2లో...




## కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం

## నటనా దిగ్గజం నానా పటేకర్ కన్నుమూత




# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

● మోదీ, షాకు సద్బుద్ధి కలగాలి ● రాజ్‌ఘాట్ వద్ద ఇండీ నేతల ప్రార్థనలు



**న్యూఢిల్లీ,అక్టోబర్ 8 :** స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశీస్సులతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని తేల్చి చెప్పారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కలిసి దాదాపు 300 మంది ఉభయ సభల ఎంపీలు బస్సులో రాజ్ ఘాట్?కు వెళ్లారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద ఒక్కొక్కరుగా నివాళులర్పించారు. దిల్లీలో శుక్రవారం

మిగతా2లో...

# పేదల ఓట్లు తొలగించే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది.

ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# మారుమూల పల్లెలకూ బ్యాంకులు, ఆసుపత్రులు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు.దేశంలో టెలికాం మౌలిక వసతులు ఊహించని రీతిలో విస్తరించాయని మోదీ వెల్లడించారు. దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ నెట్‌వర్క్ చేరుకుందని, ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు నిరంతరం సేవలందిస్తున్నాయని తెలిపారు. 2022 నాటి పరిస్థితులతో పోలిస్తే దేశంలో మొబైల్ ఇంటర్నెట్ వేగం ఏకంగా పది రెట్లు పెరగడం గర్వకారణమని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఇన్వెస్ట్', 'ఇన్నోవేట్' నినాదాలతో మొబైల్స్, టెలికాం పరికరాల తయారీలో భారత్ ప్రపంచ కేంద్రంగా అవతరిస్తోందని కొనియాడారు. డిజిటల్ సేవలు పెరుగుతున్న కొద్దీ ఫోన్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ భద్రతను పటిష్టం చేయడం అత్యవసరమని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం డీప్‌ఫేక్స్, సైబర్ మోసాలు సమాజానికి అతిపెద్ద సవాలుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, టెక్ సంస్థలు, ఆర్థిక రంగాలు కలిసి డీప్‌ఫేక్స్‌ను అడ్డుకునేందుకు ఒక గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల వద్దకు మోసపూరిత సమాచారం చేరకముందే సాంకేతిక సాయంతో అడ్డుకునేందుకు అంతర్జాతీయ టెలికాం ఆపరేటర్లు, జీఎస్ఎంఏ సమష్టిగా పనిచేయాలని సూచించారు.భుత్వ అధినేతగా 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సమయంలో ఐఎంసీ 10వ వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో ప్రత్యేకమని మోదీ చెప్పారు. ఈ ఏడాది జీఎస్ఎంఏ బోర్డు సమావేశానికి భారత్ వేదికగా నిలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ప్రపంచవ్యాప్తంగా వచ్చిన టెలికాం నిపుణులకు స్వాగతం పలికారు.

# ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. రైతులను అణిచివేసే ప్రభుత్వం

**హైదరాబాద్:అక్టోబర్ 8 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం కాదని, రైతులను అణిచివేసే విధంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫల మైందని విమర్శించారు.**రైతులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏది?**రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు అన్నారు. రైతు భరోసా నిధులు, పంటల కొనుగోళ్లు, పంట బోనస్ వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.**పంటల కొనుగోలుపై విమర్శలు**కేంద్రం నిర్దేశించిన పరిమితుల మేరకే పంటలు కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ వైఖరి రైతులకు ఇబ్బందులు కలిగిస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయా లతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.**రైతుల సమస్యలు పరిష్కరించాలి**రైతులకు అండగా నిలిచి వారి సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా పంటల కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ చలో లోక్ భవన్ ముట్టడి ఉద్రిక్తం

- సీఈసీ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నిరసన
- భారీ ప్రదర్శనగా ఇండీ కూటమి ప్రతినిధులు ర్యాలీ
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అరెస్ట్

**హైదారాబాద్,అక్టోబర్ 8 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియలో భారీగా అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపునిచ్చిన చలో లోక్ భవన్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు నగరంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ లోక్ భవన్ వైపు దూసుకెళ్లింది. వందలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు లోక్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో నిరసన తెలుపుతున్న టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి మరియు కాంగ్రెస్ నేత మహమ్మద్ అజారుద్దీన్‌లను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టుల అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు నెలకొన్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటు హక్కును కాపాడటంలో సిఇసి విఫలమయ్యారని ఆరోపించారు. పారదర్శకమైన రీతిలో ఎన్నికల వ్యవస్థ సాగాలంటే సిఇసి జ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలను కేంద్ర ప్రభుత్వం అరెస్ట్ చేయించడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ చర్యలు ముమ్మాటికీ అక్రమమని, అప్రజాస్వామికమని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టి పారదర్శకమైన ప్రక్రియను చేపట్టే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ కాంగ్రెస్ స్పష్టం చేసింది.

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఓట్ల దొంగతనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యువత సమస్యలన్నీ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, వల్లభ్ భాయ్ పటేల్ వంటి మహానాయకులు సాధించి పెట్టిన స్వేచ్ఛను, ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. లోక్?సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమను రెండు రోజులుగా నిరసన తెలపకుండా అడ్డుకున్నారని, మొదటి రోజు ఎన్నికల సంఘం వద్ద, బుధవారం జంతర్ మంతర్ వద్ద అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా, జ్ఞానేష్ కుమార్, మోహన్ భగవత్ లు నేరపూరిత కుట్ర ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఓట్లను దొంగిలించి దేశాన్ని హైజాక్ చేశారని, త్వరలోనే ఆ నలుగురిని చట్టం ముందుకు తెస్తామన్నారు. ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే దిల్లీకి చేరుకున్నారు. ఇదిలా ఉండగా, సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన ఇండీ కూటమి ఎంపీలు పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ గురువారం భోపాల్‌లో ఆందోళన నిర్వహించింది. వ్యాపమ్ స్క్వేర్ నుంచి బోర్డ్ ఆఫీస్ స్క్వేర్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి" అనే నినాదంతో భోపాల్ నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన ఈ నిరసనలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని తెలిపారు.

# నటనా దిగ్గజం నానా పటేకర్ కన్నుమూత



**ముంబై,అక్టోబర్ 8 :** ప్రముఖ బాలీవుడ్, మరాఠీ నటుడు నానా పటేకర్ (75) కన్నుమూశారు. గోవాలోని తన నివాసంలో గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురయ్యారు. వైద్యులు సుమారు 45 నిమిషాల పాటు ప్రయత్నించినప్పటికీ ఆయనను కాపాడలేకపోయారు. 1978లో సినీ రంగంలోకి అడుగుపెట్టిన నానా పటేకర్ 'సలామ్ బాంబే', 'పరిందా', 'క్రాంతివీర్', 'అగ్ని సాక్షి', 'అబ్ తక్ ఛప్పన్', 'వెల్‌కమ్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందారు. మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలు అందుకున్నారు. కళారంగానికి చేసిన సేవలకు 2013లో పద్మశ్రీ పురస్కారం వరించింది. నటుడిగానే కాకుండా రైతుల సంక్షేమం కోసం 'నామ్ ఫౌండేషన్' ద్వారా సేవలందించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# జీఎస్టీ సంస్కరణల్లో రాష్ట్రాల ప్రయోజనాలు ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించే వారికి విధానాలను సరళీకరించడంతో పాటు, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడేవారిపై కఠిన చర్యలు కొనసాగించాలని భట్టి అన్నారు. జీఎస్టీ అమలులో కేంద్రం, రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేస్తూ రాష్ట్రాల ఆదాయాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వాటా సుమారు 35 శాతం ఉందని, ఆదాయంలో తగ్గుదల రాష్ట్రంలో పాఠశాలలు, ఆసుపత్రులు, సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. మోటార్ వాహనాలు తదితర రంగాల్లో ప్రతిపాదిత మార్పుల వల్ల తెలంగాణకు ఏటా సుమారు రూ.800 కోట్ల ఆదాయ ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు, నకిలీ ఇన్‌వాయిస్‌లు, గుర్తింపు వివరాల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని భట్టి కోరారు. అలాగే హైదరాబాద్‌లో జీఎస్టీఎన్, జీఎస్టీ కౌన్సిల్ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, కీలక కమిటీల్లో తెలంగాణకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం అంతిమంగా ప్రజలకు చెందుతుందని, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు.

# వ్యాపారులకు భారీ ఊరట..

(మొదటి పేజీ తరువాయి)

ప్రాసిక్యూషన్ నిబంధనలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను తొలగిస్తూ.. కౌన్సిల్ నిర్ణయించింది. దీంతో జీఎస్టీ ఉల్లంఘనలకు సంబంధించి పన్ను అధికారులు నేరుగా అరెస్ట్ చేసే అవకాశం ఇక ఉండదు. ఇప్పటివరకు తీవ్రమైన పన్ను ఎగవేత, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వంటి కొన్ని కేసుల్లో జీఎస్టీ అధికారులు అరెస్ట్ చేసే అధికారం ఉంది. ఈ అధికారాన్ని పరిమితం చేయడం ద్వారా సాధారణ పన్ను వివాదాలు, వ్యాపార సంబంధిత పొరపాట్లు క్రిమినల్ చర్యల స్థాయికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో సంస్కరణలు తీసుకొచ్చింది కేంద్రం. పన్ను బకాయిల వసూలు, వడ్డీ, జరిమానాల విధింపు వంటి ఇతర చర్యలు మాత్రం కొనసాగుతాయి. అదే సమయంలో జీఎస్టీ కింద ప్రాసిక్యూషన్ ప్రారంభించే పరిమితిని కూడా భారీగా పెంచారు. ఇప్పటివరకు రూ.1 కోటి పన్ను ఎగవేతకు సంబంధించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ ప్రారంభించే అవకాశం ఉండగా.. ఇకపై ఆ పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు. అంటే రూ.5 కోట్లకు లోబడిన పన్ను ఎగవేత కేసుల్లో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు వెళ్లే అవకాశం తగ్గనుంది. ఈ మార్పులను పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయడం, వ్యాపార సంస్థలపై అనవసరమైన చట్టపరమైన ఒత్తిడిని తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో కొత్త సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జీఎస్టీ 2.0లో భాగంగా కేవలం అరెస్ట్, ప్రాసిక్యూషన్ నిబంధనలే కాకుండా.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వ్యవస్థలో మార్పులు, రిఫండ్లను వేగవంతం చేయడం, వివాదాలను తగ్గించడం వంటి పలు అంశాలపై కూడా కౌన్సిల్ దృష్టి సారించింది. మొత్తంగా చూస్తే, జీఎస్టీ అమలులో కఠినమైన క్రిమినల్ చర్యల కంటే పన్ను వసూళ్లు, అనుసరణ, సులభమైన వ్యాపార విధానాలకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా తాజా నిర్ణయాలు ఉన్నాయని చెప్పొచ్చు. అయితే ఈ మార్పులు పూర్తిగా అమల్లోకి రావడానికి అవసరమైన చట్టపరమైన సవరణలు, తదుపరి ప్రక్రియ కూడా కీలకం కానున్నాయి.

# 'సీతారామ' సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేయాలి



**సత్తుపల్లి:అక్టోబర్ 8 :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలను తీర్చే లక్ష్యంతో చేపట్టిన 'సీతారామ' ఎత్తిపోతల పథకం, సత్తుపల్లి ట్రంక్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయి ప్రాజెక్టు పురోగతి, పెండింగ్ పనులు, భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు.**రైతులకు వెంటనే పరిహారం** పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని తుమ్మల కోరారు. సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తయితే సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయని తెలిపారు.**ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా** వర్షాభావ పరిస్థితుల్లో ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో సీతారామ ప్రాజెక్టు కీలకంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి నీటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.**పెండింగ్ పనులపై అధికారులకు ఆదేశాలు** మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. భూసేకరణ, పైప్‌లైన్, ఇతర పనుల పురోగతిని సమీక్షించి, రైతులకు త్వరగా సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయడంతో పాటు భూసేకరణ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

# 'బిల్డ్ ఏపీ' మా నినాదం

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించా రు. గత 28 నెలల్లో రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చంద్రబాబు తెలిపారు. కేవలం అవగాహన ఒప్పందాల (ఎంవోయూ)కే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ పెట్టుబడులుగా మార్చేందుకు పటిష్టమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఎస్క్రో ఖాతాను నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. పెట్టుబడులకు అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలకు అన్ని అనుమతులు వేగంగా అందిస్తున్నామని తెలిపారు. నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నీటి కొరత తీర్చవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా, రాష్ట్రాన్ని సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా మార్చడమే ధ్యేయమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 110 గిగావాట్లకు ఒప్పందాలు కుదిరాయని, ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దుగరాజపట్నం, మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ కేంద్రాలు, తిరుపతి, కొప్పర్తిలలో ఎలక్ట్రానిక్స్, డ్రోన్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాలనలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామని, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలవరం, అమరావతి నిర్మాణానికి అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, భారత అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్‌ది చారిత్రక పాత్ర అని కొనియాడారు. శాతవాహనుల కాలం నుంచే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యానికి ప్రసిద్ధి అని గుర్తుచేశారు. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "టీమ్ ఇండియా"గా కలిసి పనిచేస్తున్నాయని, కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని అన్నారు. 'ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష' అనే విధానాలతో దేశం ముందుకు సాగుతోందని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్ననాటి స్నేహితుడికి చేయూతనందించిన బాల్యమిత్రులు..!!

**- ఆపదలో అండగా నిలిచి స్నేహబంధాన్ని చాటుకున్న 1992-93 టెన్త్ బ్యాచ్ మిత్రులు**



**చిట్యాల, ప్రతినిధి అక్టోబర్ 7 (పీపుల్స్ న్యూస్)**
చిన్ననాటి స్నేహం... కాలం మారినా, దూరాలు పెరిగినా, జీవితంలో ఎన్నో మార్పులు వచ్చినా చెరిగిపోదని నిరూపించారు జూకల్ గ్రామానికి చెందిన 1992-93 బ్యాచ్ పదో తరగతి బాల్యమిత్రులు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకుని, కలిసి పెరిగిన తమ మిత్రుడు కష్టాల్లో ఉన్న సమయంలో మేమున్నామంటూ ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన వేమునూరు జగదీశ్వర్ చారి తల్లి సుశీలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. తల్లిని కోల్పోయిన జగదీశ్వర్ చారి కుటుంబం విషాదంలో మునిగిపోయింది. కన్నతల్లిని కోల్పోయిన బాధలో ఉన్న తమ చిన్ననాటి మిత్రుడికి కేవలం పరామర్శతో సరిపెట్టుకోకుండా, తమ వంతు ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని బాల్యమిత్రులు నిర్ణయించుకున్నారు.ఈ మేరకు 1992-93 బ్యాచ్ పదో తరగతి మిత్రులు మాటూరి రవీందర్ గౌడ్, పాలెపు రాంబాబు, వైనాల శ్రీనివాస్, మేకల మహేష్, జంబుల సురేందర్, చిదిరాల శ్రీధర్, మహమ్మద్ వలి హైదర్, అంకుషావళి, చాడ రమణారెడ్డి, తోట బిక్షపతి, కసిరెడ్డి పూర్ణచందర్ రెడ్డి, పల్లె శ్రీనివాస్, తాటిపెల్లి రవీందర్, కూస ఆనంద్, కాల్వ మధుకర్ రెడ్డి తదితరులు కలిసి ఆర్థిక సహాయం అందించారు.జగదీశ్వర్ చారి నివాసం ఉన్న హనుమకొండకు వెళ్లిన బాల్యమిత్రులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తల్లి మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న జగదీశ్వర్ చారిని ఓదార్చి, తాము ఎప్పటికీ తన వెంటే ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో స్నేహితుడికి అండగా నిలిచారు. “చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం... కలిసి ఆడుకున్నాం... కలిసి పెరిగాం. జీవితంలో ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా మిగతా స్నేహితులంతా అండగా నిలవాలి” అనే భావంతో మిత్రులంతా ఒక్కటై జగదీశ్వర్ చారి కుటుంబానికి అండగా నిలిచారు.తల్లిని కోల్పోయిన బాధను ఏ సహాయంతోనూ తీర్చలేమని తెలిసినా, కష్ట సమయంలో తోడుగా నిలిచే మనుషులు ఉన్నారనే ధైర్యాన్ని ఇవ్వడమే తమ ఉద్దేశమని మిత్రులు తెలిపారు. భవిష్యత్తులో కూడా జగదీశ్వర్ చారి కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు.కాలగమనంలో స్నేహితులంతా వివిధ ప్రాంతాల్లో, వివిధ రంగాల్లో స్థిరపడినా... బాల్యంలో ఏర్పడిన స్నేహబంధం మాత్రం ఇప్పటికీ అదే ఆప్యాయతతో కొనసాగుతోంది. ఆపద సమయంలో పలకరించడం కంటే ముందడుగు వేసి చేతనైన సహాయం చేయడం ద్వారా నిజమైన స్నేహానికి అర్థం చూపించారు.కన్నతల్లిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న జగదీశ్వర్ చారికి ఆర్థికంగా, మానసికంగా అండగా నిలిచిన బాల్యమిత్రుల తీరును జూకల్ గ్రామస్తులు అభినందిస్తున్నారు. స్నేహం అంటే కేవలం కలిసి నవ్వుకోవడం మాత్రమే కాదు... కన్నీటి సమయంలో పక్కన నిలబడి ఆ కన్నీటిని తుడవడమే నిజమైన స్నేహమని 1992-93 బ్యాచ్ మిత్రులు తమ ఆచరణ ద్వారా చాటిచెప్పారు.

# మాన్యశ్రీ కాన్షిరామ్ ఆలోచనా విధానంపై ‘ఒక సమాలోచన’

**-- తెలంగాణలో మాన్యశ్రీ కాన్షిరామ్ ఆలోచనా విధానాన్ని పునరుజ్జీవింపజేయగలమా?!**



**బాలానగర్ అక్టోబర్ 09 ( పీపుల్స్ న్యూస్)**
బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో “మాన్యశ్రీ కాన్షిరామ్ ఆలోచనా విధానం -- తెలంగాణ రాష్ట్రంలో పునరుజ్జీవం చేయగలమా?” అనే అంశంపై “ఒక సమాలోచన” కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు డా బూదాల బాబూరావు ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా బహుజన, దళిత, గిరిజన, బీసీ వర్గాల సామాజిక, రాజకీయ చైతన్యం, ఐక్యత, హక్కుల సాధనకు సంబంధించిన అంశాలపై ప్రముఖులు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఎస్ఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి, అంబేద్కర్ సంఘాల సమైక్య చైర్మన్ రాపోలు రాములు, మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డ యాదయ్య, జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు భుదాల బాబురావు, బీసీ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు మణికంఠ, గిరిజన జేఏసీ చైర్మన్ ఆర్. రాజేష్ నాయక్, ఎంఆర్పీఎస్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ మీశాల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగానికి చెందిన డాక్టర్ బొమ్మెర స్టాలిన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.కార్యక్రమానికి బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్ అధ్యక్షత వహించనున్నారు. బహుజన వర్గాల విద్యార్థులు, యువత, సామాజిక ఉద్యమకారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

**వేదిక: బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, హైదరాబాద్**
**సమయం: ఉదయం 11 గంటలకు**
**ఆధ్వర్యం: బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్**

# కత్తితో బెదిరించి రూ.9.50 లక్షలు దోపిడీ

**- నిందితుడిని అరెస్టు చేసిన గోషామహల్ పోలీసులు**



**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)**
బెగంబజార్‌లో వ్యాపారి వద్ద కత్తితో బెదిరించి రూ.9.50 లక్షల నగదు దోపిడీ చేసిన కేసులో గోషామహల్ పోలీసులు ఒక నిందితుడిని అరెస్టు చేశారు. ఛత్రినాకకు చెందిన మొహమ్మద్ జహీర్ అలియాస్ ఇస్మాయిల్ (37)ను గురువారం చంద్రాయణగుట్టలో అదుపులోకి తీసుకున్నారు.
పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 5న వాచ్ వ్యాపారి కేవల రామ్ బెగంబజార్‌లో వ్యాపార లావాదేవీలకు సంబంధించిన సుమారు రూ.9.50 లక్షల నగదుతో వెళ్తుండగా, అజీజ్ ప్లాజా సమీపంలోని అమర్ ఎస్టేట్ బాల్కనీ ప్రాంతంలో నిందితుడు కత్తితో బెదిరించి నగదును బలవంతంగా లాక్కెళ్లాడు. ఈ ఘటనలో బాధితుడి చేతులు, మెడకు గాయాలయ్యాయి.
బాధితుడి ఫిర్యాదు మేరకు గోషామహల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నివాసం నుంచి రూ.9 లక్షల నగదు, అతడి వద్ద నుంచి రూ.480 నగదు, వివో వై21 మొబైల్ ఫోన్, నేరానికి ఉపయోగించినట్లు పేర్కొన్న కూరగాయలు కోసే కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

**నగదు తీసుకెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలి.**
పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లే సమయంలో ఒంటరిగా ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. వీలైనంత వరకు బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులను వినియోగించాలని, వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ములుగు జిల్లా లోని ఇసుక లారీలతో భద్రత లేని ప్రయాణం

- ●ఇసుక లారీల వల్ల రోడ్డుపై కి రావాలంటే భయపడుతున్న ప్రజలు
- ●కట్టుదిట్టమైన భద్రతా చర్యల పై ప్రజల అసహనం
- ● రోడ్డు ప్రమాదం లారీ కిందికి దూసుకెళ్లిన కారు..
- ●163వ జాతీయ రహదారిపై లారీ--కారు--మినీ వ్యాన్ ఢీ..
- ● కారులో ఇరుక్కుపోయిన ఇద్దరు పలువురికి గాయాలు..
- ●ఒకరిద్దరి పరిస్థితి విషమం..
- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు






**ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08 (పీపుల్స్ న్యూస్)**
పసర సమీపంలోని 163వ జాతీయ రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఫారెస్ట్ కాంటా హర్షి సమీపంలో లారీ, కారు, మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో పలువురు గాయపడినట్లు సమాచారం. ప్రమాద తీవ్రతకు కారు లారీ కిందికి దూసుకెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు వాహనంలో ఇరుక్కుపోయారు. కారులో మహిళలు కూడా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.ప్రమాదంలో పలువురికి గాయాలు కాగా, ఒకరిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనతో జాతీయ రహదారిపై ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పసర పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వాహనాల్లో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసేందుకు చర్యలు చేపట్టి, గాయపడిన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

**అప్రమత్తతే ప్రాణ రక్షణ:**
163వ జాతీయ రహదారిపై ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, ప్రమాదకర మలుపులు, రద్దీ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ప్రయాణించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి సంబంధిత అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరుబాట..

**చలో లోక్‌భవన్‌లో బండి రమేష్**



**ఉప్పల్ : ప్రతినిధి, శ్రవణ్ కుమార్ అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)**
ఓట్ల సవరణ ప్రక్రియలో ఎస్ఐఆర్ పేరుతో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ‘సేవ్ డెమోక్రసీ’ కార్యక్రమంలో భాగంగా గురువారం ‘చలో లోక్‌భవన్’ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొన్నారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలను, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, సేవాదళ్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐతో పాటు వివిధ అనుబంధ విభాగాల నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి పోరాటంలో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని బండి రమేష్ పిలుపునిచ్చారు.

# ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి: డీసీపీ రాఘవేంద్ర రెడ్డి







**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)**
కుల్సుంపురా డివిజన్ పరిధిలో బతుకమ్మ, దసరా నవరాత్రి, దుర్గామాత విగ్రహాల ఏర్పాటు, రావణ దహనం కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు, ఉత్సవ నిర్వాహకులు, శాంతి కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి గోల్కొండ జోన్ డీసీపీ రాఘవేంద్ర రెడ్డి, కుల్సుంపురా ఏసీపీ తిరుపతి, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, 100 మందికి పైగా నిర్వాహకులు, స్థానిక నాయకులు, శాంతి కమిటీ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు నిర్వాహకులు సహకరించాలని సూచించారు. మండపాలు, మైక్‌లు, డీజేల వినియోగంలో నిబంధనలు పాటించాలని, నిమజ్జన ఊరేగింపులకు అనుమతించిన మార్గాలనే వినియోగించాలని స్పష్టం చేశారు. రావణ దహనం ప్రాంతాల్లో అగ్నిమాపక, విద్యుత్ భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని, ప్రతి మండపం వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో ఉత్సవాలను జరుపుకోవాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## భార్యకు చెప్పకుండా భర్త అదృశ్యం

**జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు**



సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)
స్కూల్‌కు కుమార్తెను తీసుకెళ్లి తిరిగి ఇంటికి వచ్చేలోగా భర్త అదృశ్యమైన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌లో నివసిస్తున్న చైనా బిస్వాస్‌కు ఐదేళ్ల క్రితం సౌమెన్ మల్లిక్ (26)తో వివాహమైంది. ఉపాధి కోసం మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి జీడిమెట్లలో నివాసం ఉంటున్నారు. అక్టోబర్ 8న ఉదయం 9 గంటల సమయంలో చైనా బిస్వాస్ తన పదేళ్ల కుమార్తె వైషీ బిస్వాస్‌ను పాఠశాలలో దింపేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సౌమెన్ మల్లిక్ తన దుస్తులు, ఆధార్ కార్డు, కొన్ని సర్టిఫికెట్లు తీసుకుని ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భర్త మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మియాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి






సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)
మియాపూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో 29 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. హెచ్‌ఎంటీ స్వర్ణపురి కాలనీకి చెందిన విష్ణు బండారి (29) గురువారం అర్ధరాత్రి 12.10 గంటల సమయంలో ఎఫ్‌జెడ్ బైక్‌పై కూకట్‌పల్లి నుంచి మియాపూర్ వైపు వెళు_తున్నాడు. మెట్రో పిల్లర్ నంబర్ 600 సమీపంలోని యూటర్న్ వద్దకు చేరుకోగానే వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన టిప్పర్ లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణుకు తలకు, పొత్తికడుపుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మియాపూర్‌లోని టీఎక్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ తెల్లవారుజామున 1.25 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పూజా బండారి ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ ఎన్. కృష్ణయ్య దర్యాప్తు చేస్తున్నారు.

## మేట్ల కొత్త లెక్క- పెరిగిన బాధ్యతలు..నూతన విధానంతో మేట్ బాధ్యతలు మరింత పెరిగాయి



**వాంకిడి, అక్టోబరు 8 :**
ఉపాధి హామీ పనుల్లో కూలీలను సమీకరించి, పని ప్రదే శంలో పర్యవేక్షించే మేట్‌లను ఇకపై కూలీల సంఖ్య కు అనుగుణంగానే కేటాయించాల్సి ఉంటుంది. ప్రతీ 20 మంది కూలీలకు ఒక మేట్‌ను, 40 మంది వరకు ఉంటే ఇద్దరిని, ఆపై కూలీల సంఖ్య పెరిగే కొద్దీ అదనంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు తెలం గాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పరిధిలో వీబీజీ రామ్‌జీలో 335 గ్రామ పంచాయతీల్లో 1.22 లక్షలు జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 2.44 లక్షలు కూలీలు ఉన్నారు. వీరిలో 85 వేలు క్రియాశీల జాబ్‌కార్డులు 1.57 మంది యాక్టివ్ వర్కర్లు ఉన్నారు. జిల్లాలో ప్రస్తుతం 160 మంది ఫీల్డ్ అసి స్టెంట్లు ఉండగా 2152 మంది మేట్‌లు పనిచే స్తున్నారు. ఇందులో 2001 మంది పురుషులు, 18 మంది మహి ళలు ఉన్నారు. కొత్త నిబంధనల ప్రకారం జిల్లా వ్యాప్తంగా యాక్టివ్ కూలీల సంఖ్య ను బట్టి మేట్లను నియమించే అవకాశముంది.- పెరిగిన బాధ్యతలు..నూతన విధానంతో మేట్ బాధ్యతలు మరింత పెరిగాయి. కేవలం కూలీలకు పని చూపించడమే కాకుండా పనిస్థలంలో గుర్తులు చూపించడం, రోజు వారీ హాజరునమోదు చేయడం, ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ యాప్ లేదా భౌతిక మస్టర్ రోల్ ద్వారా డిజిటల్ హాజరు తీసుకోవడం వీరి ముఖ్య బాధ్యత. దాంతో పాటు రోజువారీ కొలతలు తీసుకోవడం, ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ నిర్వహించడం, ప్రతి కూలీ చేసిన పని వివరాలు, పొందిన వేతనాన్ని ఉపాధి కార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో మేట్ ప్రభుత్వ రికార్డులకు, కూలీలకు మధ్య కీలక అనుసంధానకర్తగా మారనున్నారు.- ప్రోగ్రామ్ అధికారి..ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉండి ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ హాజరు అప్‌లోడ్ చేసే సామర్థ్యం ఉన్న కూలీలనే మేట్లుగా గుర్తించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రోగ్రామ్ అధికారి పరిశీ లించి ఆమోదించిన తర్వాత వారిని సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారు. వీరికి ఎన్‌ఎమ్‌ఎమ్‌ఎస్ వినియో గంపై శిక్షణ ఇస్తారు. కపంద్ర ఎస్‌వోపీ ప్రకారం పనిస్థలంలోనే జియోటాగింగ్, సమయ నమోదుతో పాటు ఫేస్ అథెంటికేషన్ ద్వారా హాజరును డిజి టల్‌గా నమోదు చేయాల్సి ఉంటుంది. అంథెం టికేషన్ విఫలమైతే నిర్దేశించిన మినహాయింపు విధానాన్ని అనుసరించి డిజిటల్‌గా నమోదు చేయా లి. కాగితపు మస్టర్ కంటే డిజిటల్ ఆధారాలతో నిర్ధారించే విధానం బలోపేతం కానుంది. మస్టర్ రోల్ ముగిసిన మూడు రోజుల్లోగా సాంకేతిక సిబ్బంది కొలతలు పూర్తి చేసి డిజిటల్‌గా నమోదు చేసిన తర్వాతే వేతనాల జాబితా రూపొందుతుంది. దీంతో కూలీ హాజరు ఒకవైపు, చేసిన పని పరిమా ణం మరోవైపు ఉండగా.. రెండింటినీ అనుసం? దానించే బాధ్యత మరింత కీలకంగా మారుతుంది.- మహిళలకు ప్రాధాన్యం..మేట్ల ఎంపికలో మహిళా కూలీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఉపాధి పనుల్లో అనుభవం ఉన్న మహిళా కూలీలకు కొత్త బాధ్యతలు చేపట్టే అవసకాశం కల్పించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి పనులపై అవగాహన ఉన్న మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. కొత్త ఎస్‌వోపీ ప్రకారం వేతనం చెల్లిస్తారు. వీరికి ప్రత్యేక ఈ- మస్టర్ జారీ చేసి వేతనాన్ని నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు. మస్టర్ రోల్ ముగిసిన మూడు రోజుల్లోగా సాంకేతిక సిబ్బంది కొలతలు పూర్తి చేసి డిజిటల్‌గా నమోదు చేసిన తర్వాతే వేత నాల జాబితా రూపొందుతుంది.

# తగ్గిపోతున్న వృక్షజాతి.. కనుమరుగవుతున్న బతుకమ్మ పూలు

**- తంగేడు, గునుగు, గుమ్మడి కోసం అష్టకష్టాలు..**
**పసుపుతోనే గౌరమ్మలు చేసే పరిస్థితి**



ములుగు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7( పీపుల్స్ న్యూస్)
తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు రోజులు దగ్గరపడుతున్న వేళ సంప్రదాయ పూల కొరత ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పొలాల గట్లు, చెరువుల కట్టలు, బీడు భూములు, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా కనిపించిన తంగేడు, గునుగు, గుమ్మడి, బంతి,



### కనుమరుగవుతున్న సాంప్రదాయ పూలు

చామంతి వంటి పూలు ప్రస్తుతం క్రమంగా కనుమరుగవుతున్నాయి. దీంతో బతుకమ్మను పేర్చేందుకు అవసరమైన సంప్రదాయ కోసం మహిళలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

**వెంచర్లు.. రోడ్ల విస్తరణతో తగ్గుతున్న పూల మొక్కలు**
పట్టణాలు, గ్రామాల చుట్టుపక్కల పెరుగుతున్న రియల్ ఎస్టేట్ వెంచర్లు, రోడ్ల విస్తరణ, భూముల వినియోగంలో మార్పులు, చెట్ల నరికివేత కారణంగా సహజంగా పెరిగే పూల మొక్కలకు ఆవాసం లేకుండా పోతోంది. గతంలో పొలాల గట్లు, చెరువు కట్టలు, అడవులు, ఖాళీ ప్రదేశాల్లో సులభంగా లభించిన తంగేడు, గునుగు ఇప్పుడు వెతికినా కనిపించని పరిస్థితి ఏర్పడింది.

**పసుపుతోనే గౌరమ్మలు**
గతంలో ఇంటి పరిసరాల్లోనే పూలను సేకరించి బతుకమ్మను పేర్చుకునే మహిళలు ప్రస్తుతం మార్కెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. సంప్రదాయ పూలు అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి తెచ్చే పూలకు డిమాండ్ పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో గౌరమ్మను తయారు చేసేందుకు కూడా సంప్రదాయ పూలు దొరకక పసుపుతోనే గౌరమ్మలను తయారు చేసే పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సంరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరం**
వాతావరణ మార్పులు, వర్షపాతం తీరులో మార్పులు, పచ్చదనం తగ్గడం కూడా సహజంగా పెరిగే సంప్రదాయ పూల మొక్కల మనుగడపై ప్రభావం చూపుతున్నాయి. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాకుండా తెలంగాణ ఆడపడుచుల సంస్కృతి, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి ప్రతీక. అందువల్ల తంగేడు, గునుగు, గుమ్మడి వంటి స్థానిక పూల మొక్కలను గ్రామాలు, చెరువుల కట్టలు, ప్రభుత్వ భూములు, పాఠశాలలు, రహదారుల వెంట విస్తృతంగా నాటాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. సంప్రదాయ పూల మొక్కలను ఇప్పటి నుంచే సంరక్షించి, పెద్ద ఎత్తున పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని వారు సూచిస్తున్నారు. సంప్రదాయ పూలను కాపాడితేనే రాబోయే తరాలకు బతుకమ్మ పండుగ పూర్వ వైభవాన్ని అందించగలమని పేర్కొంటున్నారు.

# పేగు బంధం కరువైంది.. బాలానగర్‌లో నవజాత శిశువు రోడ్డుపాలు..!



బాలానగర్ అక్టోబర్ 09 ( పీపుల్స్ న్యూస్)
కని పెంచాల్సిన పేగు బంధమే తెగిపోయిందో.. లేక వెంటాడిన కఠిన పరిస్థితులే లొంగదీసుకున్నాయో గానీ, అప్పుడే కన్నుతెరిచిన నవజాత మగ శిశువును రోడ్డుపై పడేసిన అమానుష ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది.

**-- స్థానికుల అప్రమత్తత.. పునర్జన్మ పొందిన పసికందు**
బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాలానగర్ వైన్స్ సమీపంలో ఓ కండువాలో చుట్టి ఉన్న పసికందు రోదిస్తూ ఆ దారిన వెళ్తున్న కొందరు స్థానిక యువకులకు కనిపించింది.



నిశ్శబ్ద వాతావరణంలో చిన్నారి ఏడుపు విని దగ్గరకు వెళ్లిన ఆ యువకులు, దృశ్యాన్ని చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వేళపాళ లేని వేళ, ఏమాత్రం కాలయాపన చేయకుండా వెంటనే బాలానగర్ పోలీసులకు సమాచారం అందించారు.

**-- సకాలంలో వైద్యం.. ప్రాణాపాయం తప్పిన చిన్నారి...**
సమాచారం అందుకున్న వెంటనే బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, డీఐ సక్రమ్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు, శిశువును తక్షణమే బాలానగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చిన్నారికి అత్యవసర చికిత్స అందించి, నిరంతర పరిశీలనలో ఉంచారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని, ప్రస్తుతం పాప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందో లేదో వైద్యులు పర్యవేక్షిస్తున్నారు.

**-- రంగంలోకి పోలీసులు.. సీసీటీవీల పరిశీలన...**
పోలీసుల సహకారంతో వైద్యులు శిశువుని అమీర్పేట్ లోని శిశు విహార కు తరలించారు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. బాలానగర్ ప్రధాన రహదారిలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శిశువును వదిలివెళ్లిన కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నవారు ఎవరు, ఈ నిర్దయ చర్యకు వెనుక ఉన్న కారణాలేమిటనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పసికందును రోడ్డుపాలు చేసిన బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ నరేష్ రెడ్డి స్పష్టం చేశారు.

# బాలానగర్‌లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**-- వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి**

బాలానగర్ అక్టోబర్ 09 ( పీపుల్స్ న్యూస్)
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బాలానగర్ డివిజన్‌లో ఈ నెల 10వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వేడుకల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్ డివిజన్‌లో గత 19 సంవత్సరాలుగా బతుకమ్మ సంబరాలను నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను తీసుకువచ్చి సామూహికంగా బతుకమ్మ ఆడుతూ,



పాటలు పాడుతూ పండుగను ఆనందంగా జరుపుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆవుల రవీందర్ రెడ్డి ఆకాంక్షించారు. బాలానగర్ డివిజన్‌లో నిర్వహించే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మహిళలు, యువతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఖాజా, దేవులపల్లి కృష్ణమూర్తి, మహిళా అధ్యక్షురాలు తదితరులు పాల్గొని బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై చర్చించారు.

# పోలీస్ యూనిట్ల పనితీరు మెరుగుపడితేనే జాతీయ స్థాయిలో రాణిస్తాం

**- నూతన క్రిమినల్ చట్టాల అమలులో వేగం పెంచాలి: డీజీపీ సి.వి. ఆనంద్**







**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)** నూతన క్రిమినల్ చట్టాల అమలుతోపాటు నేరాల నియంత్రణ, దర్యాప్తు నాణ్యత, నేర నిరూపణ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసు యూనిట్ల పనితీరు మెరుగుపడితేనే జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మెరుగైన ర్యాంకింగ్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.క్రైమ్ ర్యాంకింగ్‌లో వెనుకబడిన పోలీసు యూనిట్ల కమిషనర్లు, ఎస్పీలు, ఇతర అధికారులతో గురువారం సీఐడీ కార్యాలయంలో డీజీపీ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన క్రిమినల్ చట్టాల అమలు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, లైంగిక నేరాల ట్రాకింగ్, జీరో ఎఫ్ఐఆర్, ఈ-సాక్ష్య తదితర అంశాలపై యూనిట్ల వారీగా సమీక్షించారు.గతంలో ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై నిర్వహించిన సమీక్షల అనంతరం ఆయా విభాగాలు జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించాయని డీజీపీ తెలిపారు. ఇదే విధంగా ఇతర విభాగాల్లోనూ లోపాలను గుర్తించి, నిరంతరం సమీక్షించుకుంటూ పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు.

**ఆరు అంశాలపై సమీక్ష.**

కేసుల పరిష్కారం, లైంగిక నేరాల ట్రాకింగ్, పెండింగ్ కేసుల సత్వర విచారణ, నేరం జరిగిన ప్రాంతంలోనే ఎఫ్ఐఆర్ నమోదు, ఈ-సాక్ష్య వినియోగం తదితర అంశాలపై డీజీపీ సమీక్షించారు. ఆయా యూనిట్లలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించారు.

**నూతన చట్టాల అమలుపై ప్రత్యేక దృష్టి.**

జాతీయ స్థాయిలో నూతన క్రిమినల్ చట్టాల అమలును నాలుగు ప్రధాన విభాగాల ప్రాతిపదికన పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్‌కు 20 శాతం, ఆపరేషనల్ ఎఫిషియెన్సీకి 45 శాతం, ఐసీటీ అప్లికేషన్‌కు 25 శాతం, ఇంటిగ్రేషన్‌కు 10 శాతం వెయిటేజీ కేటాయించారు.జీరో ఎఫ్ఐఆర్, నిర్ణీత గడువులో దర్యాప్తు పూర్తి, ఆన్‌లైన్ చార్జిషీట్, ఈ-సాక్ష్య, ఈ-సమన్లు, న్యాయశ్రుతి, ఐసీజేఎస్ వంటి వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని డీజీపీ సూచించారు.

**సీసీటీఎన్ఎస్ డేటాను వినియోగించాలి.**

సీసీటీఎన్ఎస్‌లో నమోదయ్యే సమాచారాన్ని విశ్లేషించి నేర నియంత్రణకు ఉపయోగపడే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసులు, నేరస్తులపై ప్రత్యేక దృష్టి సారించి నేరాల పునరావృతిని అరికట్టాలని సూచించారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పిస్తామని తెలిపారు.

**వెనుకబడిన యూనిట్లు పనితీరు మెరుగుపర్చుకోవాలి.**

నూతన క్రిమినల్ చట్టాల అమలులో ములుగు జిల్లా ముందంజలో ఉండగా, జయశంకర్ భూపాలపల్లి, రామగుండం కమిషనరేట్ కూడా పలు అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచాయని అధికారులు తెలిపారు. మల్కాజిగిరి, హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్ కమిషనరేట్లు, మహబూబ్‌నగర్, జీఆర్‌పీ సికింద్రాబాద్, యాదాద్రి భువనగిరి యూనిట్లు పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని డీజీపీ సూచించారు.జాతీయ స్థాయిలో నూతన క్రిమినల్ చట్టాల అమలు ర్యాంకింగ్‌లో తెలంగాణ 60.15 స్కోర్‌తో ఉన్నట్లు సమావేశంలో వెల్లడించారు. జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్ చార్జిషీట్, ఈ-సాక్ష్య, ఈ-సమన్లు, న్యాయశ్రుతి తదితర అంశాలను మరింత సమర్థంగా అమలు చేస్తే రాష్ట్ర పనితీరును మెరుగుపర్చుకునే అవకాశం ఉందని డీజీపీ తెలిపారు.నేరాల నియంత్రణతోపాటు దర్యాప్తు నాణ్యత, నేర నిర్ధారణ శాతాన్ని పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. త్వరలో మరోసారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి యూనిట్ల పనితీరును సమీక్షిస్తామని తెలిపారు.సమావేశంలో సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, హైదరాబాద్ సీపీ సజ్జనార్, సైబరాబాద్ సీపీ రమేష్, ఐజీ మల్టీజోన్-1 చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన జిల్లా అధ్యక్షులు



**రాజాపేట అక్టోబర్ 8**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా గురువారం రేణికుంట గ్రామంలో భారతీయ జనతా పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. బిజెపి మండల అధ్యక్షులు మేకల రమేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం రెడ్డి,ఉపాధ్యక్షులు బూరుగు శేఖర్ రెడ్డి,యువ మోర్చా ఉపాధ్యక్షులు ఐరన్ శ్రీధర్,రంగ భాస్కర్,ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తొగుట నూతన సీఐగా ఎం. శ్రీను.

**- శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం.. ప్రజలకు అందుబాటులో ఉంటాం.**



**తొగుట అక్టోబర్ 8**

తొగుట సర్కిల్ నూతన సీఐగా ఎం. శ్రీను గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు తొగుట సర్కిల్ సీఐగా విధులు నిర్వహించిన ఎస్‌కే లతీఫ్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎం. శ్రీను బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది నూతన సీఐకి స్వాగతం పలికారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ ఎం. శ్రీను సర్కిల్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, పోలీస్‌స్టేషన్ల పనితీరు తదితర అంశాలపై వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువచ్చేలా వారికి అందుబాటులో ఉంటామని సీఐ తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచుతామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తామన్నారు.ప్రజలు కూడా పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎం. శ్రీను పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యాపార వివాదం.. భర్తను అపహరించారని భార్య ఫిర్యాదు




**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)** వ్యాపార నష్టాల పేరుతో తన భర్తను వేధిస్తున్నారని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడటంతో పాటు భర్తపై దాడి చేసి కారులో బలవంతంగా తీసుకెళ్లారని ఓ మహిళ జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించింది.

యాండమూరి లేఅవుట్, గజులరామారానికి చెందిన బీదల స్వాతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తన భర్త అశోక్‌రెడ్డి సుమారు మూడేళ్లుగా చంద్రశేఖర్‌తో కలిసి వ్యాపారం చేస్తున్నారని, వ్యాపారం నష్టాల్లో ఉందంటూ చంద్రశేఖర్ తన భర్తను వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వకపోతే పిల్లలను కిడ్నాప్ చేసి, తనను, పిల్లలను చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు.

అక్టోబర్ 7న ఉదయం పిల్లలను పాఠశాలలో దింపేందుకు వెళ్లిన సమయంలో ఐదుగురు వ్యక్తులు తన భర్తపై దాడి చేసి కారులో బలవంతంగా తీసుకెళ్లినట్లు స్కూల్ డ్రైవర్ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడని ఆమె పేర్కొన్నారు. భర్తకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు క్రైమ్ నంబర్ 1358/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 137(2) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మీర్‌చౌక్ పోలీసుల చొరవతో 25 మొబైల్ ఫోన్లు రికవరీ

**- బాధితులకు ఫోన్లు అందజేసిన ఏసీపీ శ్యామ్ సుందర్**



**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)**




సీఈఐఆర్ (CEIR) పోర్టల్ సాయంతో మీర్‌చౌక్ పోలీసులు పోయిన, చోరీకి గురైన 25 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. గురువారం మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ జి. శ్యామ్ సుందర్ బాధితులకు ఫోన్లను అప్పగించారు.వివిధ సందర్భాల్లో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సాంకేతిక విశ్లేషణ చేపట్టి ఫోన్ల ఆచూకీ గుర్తించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి 25 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని ఏసీపీ శ్యామ్ సుందర్ సూచించారు. సాంకేతిక ఆధారాలతో ఫోన్లను త్వరగా గుర్తించి రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.ఏసీపీ పర్యవేక్షణలో మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ ఎం. కొండల్‌రావు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సైదయ్య మార్గదర్శకత్వంలో డీఎస్ఐ ఎం.డి. ముజ్తబా అలీ కాసిమ్, క్రైమ్ డిటెక్టివ్ బృందం ఫోన్లను రికవరీ చేసింది. ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

# ప్రభుత్వ భూమిలో నిర్మాణం.. అధికారుల విధులకు అడ్డంకి




**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)**

ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇంటిని కూల్చివేసేందుకు వెళ్లిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విధులకు అడ్డంకి కలిగించిన ఇద్దరిపై జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 8న మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీమ్ కుత్బుల్లాపూర్ గ్రామం, మండలంలోని సర్వే నంబర్ 348లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇంటిని తొలగించేందుకు వెళ్లారు. అక్కడ నివాసముంటున్న పి.గోపి, ఎన్.వీరస్వామి అధికారిని అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించినట్లు పోలీసులు తెలిపారు.విచారణలో తిరుపతయ్య, సైదులు, ప్రసాద్ తమకు భూమిని విక్రయించి ఇల్లు నిర్మించినట్లు వారు వెల్లడించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎస్ఐఆర్‌తో ఓట్ల తొలగింపును ఆపాలి

**అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా పారదర్శక విధానం అమలు చేయాలి**

**మేడ్చల్--మల్కాజిగిరి, అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)** ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించకుండా చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్, జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు.ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్న వారు.. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ఎన్నికల సంఘం పారదర్శక విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, ఓటర్ల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని చంద్రకాంత్, వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.





# చేవెళ్లలో దారుణం.. సెల్‌ఫోన్ చోరీ వివాదం, ఒకరి హత్య.



**చేవెళ్ల, అక్టోబర్ 09:**
చేవెళ్ల బస్టాండ్ ఆవరణలో చోటుచేసుకున్న ఓ చోరీ ఘటన చివరకు దారుణ హత్యకు దారితీసింది. స్థానికంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ?చేవెళ్ల గ్రామానికి చెందిన కొజ్జంకి కృష్ణ, సాయి విజయ్, రాజుతో పాటు మరో నలుగురు వ్యక్తులు కలిసి వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు చెందిన ఒక వ్యక్తి వద్ద ఉన్న సెల్‌ఫోన్, ఏటీఎం కార్డుతో పాటు కొంత నగదును అపహరించారు. బాధితుడు తన ఫోన్ గురించి నిలదీయగా, చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కందవాడ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లో దానిని దాచిపెట్టినట్లు నిందితులు తెలిపారు. ఆ ఫోన్‌ను తిరిగి తెచ్చుకునేందుకు బాధితుడు మరియు నిందితులు ముగ్గురూ కలిసి మోటార్ సైకిల్‌పై డంపింగ్ యార్డ్ వద్దకు వెళ్లారు. అక్కడ ఆస్తులు, ఫోన్ విషయమై వారి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గొడవ కాస్తా తారాస్థాయికి చేరి, వారు కర్రలతో పరస్పరం కొట్టుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలో జరిగిన దాడిలో ఆ వ్యక్తిని హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. సమాచారం అందుకున్న చేవెళ్ల పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ దొంగతనానికి, హత్యకు పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకుని తీవ్రంగా విచారిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పూర్తి వివరాల కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కరెంటు కోతలపై రోడ్డెక్కిన రైతులు.

**- వికారాబాద్-తాండూర్ రహదారి దిగ్బంధం**



**వికారాబాద్, అక్టోబర్ 09 :**
వికారాబాద్ నియోజకవర్గంలో తీవ్రమైన విద్యుత్ కోతలను నిరసిస్తూ ధారూర్ మండల పరిధిలోని రైతులు రోడ్డెక్కారు. వికారాబాద్ - తాండూర్ ప్రధాన రహదారిని దిగ్బంధించి ఆందోళన చేపట్టారు. ధారూర్ మండలం కేరెల్లి, ఇబ్బనూర్, కొండాపూర్ కుర్దు, బాచారం తదితర గ్రామాల రైతులు ఈ ధర్నాలో పెద్దఎత్తున పాల్గొన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆనంద్ మాదిగ మాట్లాడుతూ.. తాను స్వయంగా రైతునని, విద్యుత్ కోతల వల్ల తన బోరు మోటర్, బావి మోటర్ కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పగటిపూట నిరంతరం విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండటంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. చుట్టుపక్కల నియోజకవర్గాల్లో 24 గంటల విద్యుత్ ఇస్తుంటే, వికారాబాద్ నియోజకవర్గంలో మాత్రం కేవలం 2 నుంచి 3 గంటలు మాత్రమే నాణ్యత లేని కరెంటు ఇస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) పేరుతో ఇష్టానుసారంగా కరెంటు నిలిపివేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఎల్‌సీల బెడద తప్పాలంటే ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆన్-అఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 24 గంటల ఉచిత విద్యుత్ హామీ వికారాబాద్‌లో అమలు కావడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జలంధర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కురువ అనంతయ్య, చాకలి లింగయ్య, పిల్లికండ్ల అనంతయ్య, శ్రీకాంత్ రెడ్డి, ఓం పాల్, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరులో ఘనంగా ప్రారంభం కానున్న దసరా బోనాలు..

**- కళాకారులకు అండగా పి. వాసు యాదవ్**

**నవాబుపేట, అక్టోబర్ 09**



మన సంప్రదాయా లను, కళలను కాపాడడంలో మహబూబ్ నగర్ జిల్లా మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి. వాసు యాదవ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. నవాబుపేట మండలం కొల్లూరు గ్రామంలో గ్రామ దేవతలైన పోచమ్మ, భవాని మాత, బంగారు మైసమ్మ దసరా బోనాల ఉత్సవాల సందర్భంగా ఆయన స్థానిక కళాకారులకు అండగా నిలిచారు. ?కనుమరుగవుతున్న మన సంప్రదాయ డప్పు కళను బ్రతికించాలనే గొప్ప ఆలోచనతో, వాసు యాదవ్ తన సొంత ఖర్చులతో 4 కొత్త డప్పులను కొనుగోలు చేసి కళాకారులకు అందజేశారు. అంతేకాకుండా, ఆ డప్పులపై డొనేటెడ్ బై పి.వాసు యాదవ్" అని ముద్రించి ఇవ్వడం విశేషం. ఈ సందర్భంగా డప్పు కళాకారులకు ఆర్థిక సాయం అందించి, ఘనంగా సత్కరించి వారిలో నూతన ఉత్సాహాన్ని నింపారు. మా కళను గుర్తించి, సొంత ఖర్చులతో డప్పులు ఇచ్చి, ఆర్థికంగా ప్రోత్సహించిన వాసు యాదవ్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. వారి ఈ సహకారం మాకు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది" అని కళాకారులు ఆనందం వ్యక్తం చేశారు. సంస్కృతిని కాపాడుతూ కళాకారులను ఆదుకుంటున్న వాసు యాదవ్ సేవలను గ్రామస్తులు, భక్తులు కొనియాడుతున్నారు. ?ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ లంబ వెంకటయ్య, మిల్క్ సెంటర్ రామకృష్ణ, వడ్డే నరేష్, బ్యాగరి చెన్నయ్య, మంగలి రఘు, బ్యాగరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ కాంగ్రెస్ చైర్మన్‌గా ఎండీ. చున్ను పాషా

**పార్టీ బలోపేతానికి కృషి: చున్ను పాషా..**





**కూకట్ పల్లి ,ప్రతినిధి శ్రవణ్ కుమార్ అక్టోబర్ 08: (పీపుల్స్ న్యూస్)**
కూకట్‌పల్లి నియోజకవర్గ మైనారిటీ కాంగ్రెస్ చైర్మన్‌గా ఎండీ. చున్ను పాషా నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్-- మల్కాజిగిరి జిల్లా మైనారిటీ కాంగ్రెస్ చైర్మన్ మిర్జా అజీజుల్లా బేగ్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని, పార్టీ సిద్ధాంతాలను అనుసరిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో మైనారిటీ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని చున్ను పాషాకు సూచించారు. పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేస్తూ మైనారిటీ వర్గాలను కాంగ్రెస్ పార్టీకి మరింత చేరువ చేయడంతో పాటు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు చురుకుగా పనిచేయాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కువార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ చైర్మన్ ఇర్ఫాన్ అనుమతితోనే ఈ నియామకం జరిగినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ మార్గదర్శకత్వంలో పనిచేస్తూ మైనారిటీ కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేయాలని సూచించారు. తెలంగాణ మైనారిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఆల్ ఇండియా మైనారిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిని గౌరవిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని మిర్జా అజీజుల్లా బేగ్ ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చున్ను పాషా అన్నారు. ఈసందర్భంగా చున్ను పాషా నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

**-కామాఖ్య అమ్మవారి ఆవరణలో ఘనంగా నిర్వహణ**
**-శ్రీనివాస్ రెడ్డికి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం**





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 08 (పీపుల్స్ న్యూస్ )**
నిజాంపేట్ ప్రజల అభిమాన నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో వెలసిన ప్రముఖ శ్రీ కామాఖ్య అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు నాయకులు ఆకాంక్షించారు. నిజాంపేట్ ప్రాంత ప్రజలతో సన్నిహితంగా ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తూ కొలన్ శ్రీనివాస్ రెడ్డి ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారని నాయకులు పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, అవసరమైన సమయంలో అండగా ఉంటూ, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆయనకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతూ, ప్రాంత అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న నాయకుడిగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి తన ప్రత్యేకతను చాటుకుంటున్నారని తెలిపారు. అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లే స్వభావం, ప్రజలకు అందుబాటులో ఉండే తత్వం, సేవ చేయాలనే సంకల్పం ఆయనకు ప్రజల్లో మరింత ఆదరణ తీసుకొచ్చాయని అన్నారు. జన్మదినం సందర్భంగా కామాఖ్య అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో విశేషమని, అమ్మవారి కృపాకటాక్షాలతో కొలన్ శ్రీనివాస్ రెడ్డికి మంచి ఆరోగ్యం, ఆనందం, విజయాలు చేకూరాలని నాయకులు ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి ప్రజలకు మరింత విస్తృతంగా సేవలు అందించాలని పలువురు నాయకులు అభిమానులు, శ్రేయోభిలాషులు కోరుకున్నారు.

# షాపర్స్ స్టాప్ పరిసరాల్లో రోడ్డు ఆక్రమణల తొలగింపు










**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)**
మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాపర్స్ స్టాప్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణల తొలగింపు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ రాకపోకలకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో తొలగించారు. ఆక్రమణలు తొలగించడంతో రహదారిపై వాహనాలకు అందుబాటులో ఉన్న స్థలం పెరిగి, ట్రాఫిక్ రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని పోలీసులు తెలిపారు. డ్రైవ్‌లో ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు, బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కె. శ్రీనివాస్, ఆర్ఎస్ఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ శివరాజు, ట్రాఫిక్ సిబ్బంది, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు. ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# రాహుల్ అరెస్టు.. ప్రజాస్వామ్య గొంతు నొక్కే కుట్ర: నీలం మధు

**ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ పోరాటం ఆగదు..**
**ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి**










**పటాన్ చేరు, అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)**
కాంగ్రెస్ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడికి నిదర్శనమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ విమర్శించారు. రాహుల్ అరెస్టును నిరసిస్తూ గురువారం టీపీసీసీ, ఇండియా బ్లాక్ పార్టీల ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డు నుంచి లోక్‌భవన్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ర్యాలీని పోలీసులు అడ్డుకుని నీలం మధుతో పాటు పలువురు నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ బాధ్యత అన్నారు. ప్రశ్నించే గొంతును అరెస్టులతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. అరెస్టులు, కేసులు, బెదిరింపులతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమంగా పేర్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటం కొనసాగుతుందని నీలం మధు తెలిపారు. ఎన్నికల సంఘం తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నందుకే రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, ఇండియా బ్లాక్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ దిష్టి బొమ్మ దగ్ధం



**చిట్యాల,అక్టోబర్ 8 :** భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా గురువారం చిట్యాల పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు ఎద్దులపురి కృష్ణ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎద్దుల పురి కృష్ణ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ఫారం 6 ప్రక్రియలో అక్రమాలు జరిగాయని దీనికి కారణమైన ప్రధాన ఎన్నికల సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, చిట్యాల మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం, వెలిమినేడు సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘు మా రెడ్డి, కౌన్సిలర్లు కుక్కల మోహన్, బొబ్బలి సందీపా రామ్ రెడ్డి, దేశపాక లతా రాజేష్, నాగిల్ల సుధాకర్, ఎస్ కే ఇమ్రాన్, చిట్యాల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జాయారపు శివప్రసాద్, షాదికాన చైర్మన్ ఎస్.కె ఫరీద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి నరసింహ, రేముడాల యాదయ్య, పోకల అశోక్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## బియ్యం కొరత సృష్టిస్తున్న మిల్లర్లు, వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి:

**- కూనూరు సంజయ్ దాస్ గౌడ్:**



**చిట్యాల,అక్టోబర్ 8 :**
ఎల్ నినో ప్రభావం సాకుగా చూపి బియ్యానికి కృత్రిమ కొరత సృష్టిస్తూ, అనుమతులు లేకుండా బియ్యాన్ని దాచి, మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న రైస్ మిల్లర్లు, వ్యాపారులపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన చిట్యాలలో విలేకరులతో మాట్లాడుతూ,గత కొద్ది రోజులుగా బియ్యం ధరలు అమాంతం పెరిగిపోయాయని సాధారణ ప్రజలు నిత్యావసర సరుకు అయిన బియ్యాన్ని కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కొంతమంది మిల్లర్లు, దళారులు కలిసి మార్కెట్‌లో కొరత ఉన్నట్లు భ్రమ కల్పించి, ధరలను కృత్రిమంగా పెంచి ప్రజలను దోపిడీ చేస్తున్నారన్నారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బియ్యాన్ని నిల్వ చేసి, ఎక్కువ ధరకు అమ్ముతున్న వారిని విజిలెన్స్ మరియు పౌర సరఫరాల శాఖ అధికారులు గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలని, దాచిన బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకుని, సీజ్ చేయాలన్నారు.బియ్యం విక్రయాలపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులపై ప్రభుత్వం వెంటనే దాడులు నిర్వహించి, కఠిన చర్యలు చేపట్టాలని లేకపోతే పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందనిప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని బియ్యం ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలకు న్యాయమైన ధరకు బియ్యం అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు..

# ముడుపులు ముట్టడంతోనే బిల్డింగ్ ముట్టలే..!

- **మాజీ కార్పొరేటర్‌పై ప్రభుత్వ భూమి కబ్జా ఆరోపణలు**
- **283 గజాల స్థలంలో రెండు అంతస్తులకు అనుమతి ఎలా?**



# భూమంతర్..!

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్ )**
ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు గాజులరామారం ప్రాంతంలో వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా సర్వే నంబర్ 329 పరిధిలోని సుమారు 283 గజాల స్థలంలో నిర్మాణం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఈ స్థలం ప్రభుత్వ భూమిగా



రికార్డుల్లో ఉన్నప్పటికీ, అక్కడ నిర్మాణం కొనసాగడం పలు అనుమానాలకు తావిస్తోంది. అంతేకాకుండా ఈ స్థలానికి రెండు అంతస్తుల నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ అనుమతి ఎలా లభించింది? అన్నది ప్రధాన ప్రశ్నగా మారింది.

**మాజీ కార్పొరేటర్‌పై ఆరోపణలు**
ఈ నిర్మాణం వెనుక మాజీ కార్పొరేటర్ ప్రమేయం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఈ ఆరోపణలపై స్పష్టమైన వివరణ




ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వ భూమిలో నిర్మాణానికి అనుమతి ఇవ్వడానికి ముందు స్థల యాజమాన్య హక్కులు, రెవెన్యూ రికార్డులు, సర్వే వివరాలను అధికారులు పరిశీలిం చారా? పరిశీలించినట్లయితే ప్రభుత్వ భూమిగా గుర్తించబడిన స్థలానికి అనుమతి ఎలా ఇచ్చారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ముడుపుల ఆరోపణలపై విచారణ ఎప్పుడు?**
నిర్మాణం విషయంలో కొందరు అధికారులు, సంబంధిత వ్యక్తుల మధ్య ముడుపుల వ్యవహారం జరిగిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు అధికారికంగా వెల్లడికాలేదు. అయినప్పటికీ నిర్మాణంపై అధికారులు తీసుకుంటున్న చర్యలు, అనుమతుల జారీ విధానం, ఫైల్‌లో ఉన్న రికార్డులను బహిర్గతం చేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం జరుగుతుంటే వెంటనే చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు? కేవలం నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతున్నారా? అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల సమాధానం ఏమిటి?**
283 గజాల స్థలం ప్రభుత్వ భూమా? కాదా? ఒకవేళ ప్రభుత్వ భూమి అయితే అక్కడ నిర్మాణానికి అనుమతి ఎలా ఇచ్చారు? ఎవరి పేరుతో అనుమతి మంజూరైంది? అనుమతి ఎన్ని అంతస్తులకు ఉంది? వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు? అనుమతి నిబంధనలు ఉల్లంఘించినట్లయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన యంత్రాంగమే నిర్మాణ దారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు నిజ మా? లేక నిబంధనల ప్రకారమే అనుమతులు మంజూర య్యా యా? అన్నది అధికారుల విచారణతో తేలాల్సి ఉంది. ఇప్ప టికైనా ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి, తప్పు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## దీపాయంపల్లి లో బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు.

**- బతుకమ్మ చెరువుకు వెళ్లే దారిని సదును చేసిన గ్రామ పంచాయతీ.**



**దౌల్తాబాద్ అక్టోబర్ 8**
దౌల్తాబాద్ మండలం దీపాయంపల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా గ్రామ మహిళలు, ప్రజలు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు అవసరమైన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా గ్రామంలోని బతుకమ్మ చెరువు వద్దకు వెళ్లే దారిని సదును చేసి, ప్రజలు సులభంగా రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలను తీసుకుని చెరువు వద్దకు చేరుకుని వేడుకల్లో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో చెరువుకు వెళ్లే మార్గంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దారిని శుభ్రం చేసి సదును చేయించారు. గ్రామ ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ఏర్పాట్లు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గజ్వేల్ దుర్గేష్, ఉపసర్పంచ్ మస్కూరి శ్రీశైలం ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహకారంతో బతుకమ్మ చెరువు పరిసరాల్లో ఏర్పాట్లు చేపట్టారు. బతుకమ్మ పండుగను గ్రామ ప్రజలంతా సంతోషంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పండుగ రోజుల్లో మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పంచాయతీ తరఫున సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గజ్వేల్ దుర్గేష్, ఉపసర్పంచ్ మస్కూరి శ్రీశైలం, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# "పిల్లల ప్లే స్కూలా.. రేకుల షెడ్డా?"

- "చిన్నారుల భద్రత గాలికొదిలారా?"
- దీక్షా ప్లే స్కూల్ యాజమాన్యం నిర్వాహకం.
- అనుమతులు లేకుండానే పాఠశాల..?




**కుత్బుల్లాపూర్ : అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)**
చిన్నారులకు అక్షరాభ్యాసంతో పాటు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన ప్లే స్కూల్‌లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయంటూ స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సూరారం శ్రీరామ్ నగర్ కాలనీలోని వైష్ణవి నగర్ కమన్ సమీపంలో నిర్వహిస్తున్న దీక్షా ప్లే స్కూల్పై పలు ఫిర్యాదులు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేసవిని తలపించేలా ఎండలు మండుతున్న సమయంలో చిన్నారులు రేకులతో ఏర్పాటు చేసిన గదుల్లోనే ఉండాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నారులకు సరైన గాలి, వెలుతురు, ఉష్ణోగ్రత నియంత్రణ వంటి కనీస సౌకర్యాలను కల్పించకుండా చిన్నారులను గాలికి వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. పిల్లల భద్రత, ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యత కావాల్సిన చోట ఇలాంటి పరిస్థితులు





నెలకొనడంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**దుర్గంధభరిత మరుగుదొడ్లు.. ఇదేనా చిన్నారుల సంరక్షణ?**
ప్లే స్కూల్‌లోని మరుగుదొడ్ల నుంచి దుర్గంధం వస్తోందని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు ఎక్కువ సమయం గడిపే ప్రదేశాల్లో పారిశుధ్య పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. చిన్నారుల సంఖ్యకు సరిపడా ఆయాలు, సహాయక సిబ్బంది ఉన్నారా లేదా అనే అంశంపైనా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్క చిన్నారి విషయంలోనైనా అప్రమత్తత లోపిస్తే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో సిబ్బంది సంఖ్య, వారి అర్హతలు, చిన్నారుల పర్యవేక్షణ విధానంపై అధికా రులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.

**అనుమతులు ఉన్నాయా.. అధికారులు చెప్పాలి!**
అసలు ఈ ప్లే స్కూల్‌కు అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఉంటే ఏ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు? భవన భద్రత, అగ్నిమాపక భద్రత, పారిశుధ్యం తదితర ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై కూడా సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. చిన్నారుల భద్రతతో ముడిపడి ఉన్న ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్లే స్కూల్‌ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అనుమతులు, భద్రతా ప్రమాణాలు, పారిశుధ్యం, సిబ్బంది వివరాలను పరిశీలించాలని కోరుతున్నారు. చిన్నారుల ప్రాణాలు, ఆరోగ్యంతో ముడిపడిన అంశంలో అధికారులు మౌనం వహిస్తే బాధ్యత ఎవరిది? ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాతే మేల్కొంటారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్ల పై కేసు.

**నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్న ఎస్సై తఖియుద్దిన్**





**రాజాపేట అక్టోబర్ 8**
రాజాపేట మండలం రేణిగుంట గ్రామ రెవెన్యూ పరిధిలోని వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల ను అదుపులోకి తీసుకొని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణా తరలింపు పై రాజాపేట పోలీస్ వారు తనిఖీ లు నిర్వహించగా , నిబంధనలు ఉల్లఘించి రేణికుంట గ్రామానికి చెందిన జాలపు సూర్య భగవాన్ రెడ్డి ,గౌడ శ్రీకాంత్, బూరుగు శ్రీధర్ రెడ్డి ముగ్గురు వ్యక్తులు వారి ట్రాక్టర్ లతో నిబందనలు కి వ్యతిరేకంగా ఇసుక రవాణా చేస్తుండగా రాజపేట ఎస్ ఐ, తఖియుద్దిన్ పట్టుకుని కేసు నమోదు చేసి మూడు ట్రాక్టర్ల ను సీజ్ చేసినారు. ఇసుక రవాణ చేసేవారు కేవలం ప్రతి బుధవారం రోజున అన్నీ డాక్యుమెంట్స్ సమర్పించి మండల తహశీల్దార్ నుండి అనుమతి పత్రం తో సూచించిన సమయం నికి ,సూచించిన వాగు నుండి ఇసుక చేయాలని సూచించారు. నిబందనలకి విరుద్దంగా ఇసుక రవాణ చేసిన వారి పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోబడుతాయని ఎస్సై తఖియుద్దీన్ హెచ్చరించారు.

# హానర్ ల్యాబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ సామగ్రి పంపిణీ.



**చిట్యాల, అక్టోబర్ 8**
హానర్ లాబరేటరీస్ సంస్థ సహకారంతో బొంగోనిచెరువు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం స్కూల్ బ్యాగులు, యూనిఫామ్స్, షూస్, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కట్ట ఆశయ్య మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సంస్థ అందించిన సహకారం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా కంపెనీ యాజమాన్యం గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సామిడి సాయి కృష్ణారెడ్డి, ఎంపీవో కోటేశ్, పంచాయతీ కార్యదర్శి తాటికొండ లింగస్వామి, కంపెనీ జీఎం మల్లికార్జునరెడ్డి, హెచ్ఆర్ జీఎం మిథున్, ప్లాంట్ హెచ్ఆర్ ప్రసన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ యాదమ్మ, వార్డు సభ్యురాలు కట్ట సంధ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పోరుబాట..

## చలో లోక్‌భవన్‌లో బండి రమేష్



**కూకట్ పల్లి: అక్టోబర్ 8 (పీపుల్స్ న్యూస్)**
ఓట్ల సవరణ ప్రక్రియలో ఎస్ఐఆర్ పేరుతో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ' కార్యక్రమంలో భాగంగా గురువారం 'చలో లోక్‌భవన్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొన్నారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలను, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, సేవాదళ్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐతో పాటు వివిధ అనుబంధ విభాగాల నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి పోరాటంలో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని బండి రమేష్ పిలుపునిచ్చారు.

# బేగంపేట్‌లో నకిలీ ఎయిర్‌ఫోర్స్ అధికారి.. యువతులకు వల వేస్తూ బుక్కయ్యాడు..!




**హైదరాబాద్:** బేగంపేట్‌లో నకిలీ ఎయిర్‌ఫోర్స్ అధికారి కలకలం సృష్టించాడు. ఫ్లయింగ్ ఆఫీసర్ డ్రెస్‌లో బేగంపేట్ పరేడ్ గ్రౌండ్‌లోకి ప్రవేశించిన నిందితుడు.. అక్కడ ఫొటోలు దిగుతూ సంచరించాడు. అనుమానాస్పదంగా వ్యవహరించడంతో మిలిటరీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల అనంతరం అతడిని నకిలీ ఎయిర్‌ఫోర్స్ అధికారిగా తేల్చారు. నిందితుడిని బిహార్‌కు చెందిన నితీశ్ కుమార్ పాల్‌గా గుర్తించారు. అతను ప్రస్తుతం నేరెడ్‌మెట్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. అయితే, తాను ఎయిర్‌ఫోర్స్ అధికారినంటూ నితీశ్ కుమార్ యువతులకు వల వేస్తున్నట్లు విచారణలో అధికారులు గుర్తించారు. నిందితుడి ఫోన్‌ను తీసుకుని పరిశీలించగా.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎయిర్‌ఫోర్స్ అధికారి పేరుతో యువతులకు పరిచయం అవుతున్నట్లు నిర్ధారించారు. వారిని వలలో వేసుకునేందుకే తాజాగా ఫొటోలు దిగేందుకు పరేడ్ గ్రౌండ్‌కు వచ్చినట్లు అనుమానిస్తున్నారు. విచారణ అనంతరం నిందితుడిని మిలిటరీ అధికారులు బేగంపేట్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతడు ఎప్పటి నుంచి నకిలీ అధికారి అవతారంలో కొనసాగుతున్నాడు? ఎవరెవరిని మోసం చేశాడు? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు.



Syed's Family
Gyarvi Shareef
Function
On Friday
09/10/2026
At 7:00 PM
Presided By:
Al-Haj Syed Jahangir Hussain Sahab
(TELANGANA STATE CONGRESS PARTY
MINORITY SENIOR LEADER)
Venue:
S.J.H Residence, Noor Manzil,
Roda Mestry Nagar (B),
Quthbullapur, Hyderabad.
SJH YOUTH TEAM QUTHBULLAPUR

## పారదర్శకంగా మద్యం దుకాణాలకు లాటరీ

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రక్రియ



**విజయవాడ, అక్టోబర్ 08, 2026 :** జిల్లాలో రెన్యువల్ కాకుండా మిగిలిన మద్యం దుకాణాలకు గురువారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లాటరీ ప్రక్రియ (డ్రా ఆఫ్ లాట్స్) జరిగింది. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ముగిసింది. 2026-27 సంవత్సరానికిగాను ప్రభుత్వం ప్రకటించిన రెన్యువల్ విధానంలో జిల్లాలోని 124 మద్యం దుకాణాలకుగాను 106 మద్యం దుకాణాలు రెన్యువల్ అయ్యాయి. రెన్యువల్ కాని 18 మద్యం దుకాణాలకు జిల్లా కలెక్టర్ వారిచే గెజిట్ నోటిఫికేషన్ నెం.73 (తేదీ: 24.09.2026)వ తేదీన జారీచేయడం జరిగింది. నిబంధనల ప్రకారం ఒక నిర్దిష్ట దుకాణానికి కనీసం నాలుగు దరఖాస్తులు అందినప్పుడే ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. దీన్ని అనుసరించి 16 మద్యం దుకాణాలకు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. దీంతో లాటరీ ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో దుకాణాల కేటాయింపునకు లాటరీ ప్రక్రియను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాస్‌రావు, ఎన్టీఆర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి.రామశివ, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని జయిస్తే.. ఆరోగ్యం, పనితీరు మెరుగే!

- మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి అధిగమించాలి: డా. జి.సమరం
- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యవేక్షణలో విజయవంతంగా మానసిక ఆరోగ్య కార్యక్రమాలు



**విజయవాడ, అక్టోబర్ 08, 2026 :** మానసిక ఒత్తిడిని తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం తెలిపారు. ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం ఆకర్ష ఫౌండేషన్, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సైకాలజిస్ట్ డా. టి.ఎస్.రావు అధ్యక్షత వహించారు. ఉద్యోగులు ఒత్తిడిని నిర్వహించుకునే విధానంపై డా. జి.సమరం విలువైన సూచనలు చేశారు. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల నిద్ర, ఆకలి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ నడక, తగినంత నిద్ర, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న మానసిక ఆరోగ్య కార్యక్రమాల్లో ఇది 20వ కార్యక్రమమని తెలిపారు. ఉద్యోగులు మానసికంగా ఉత్సాహంగా, ఆరోగ్యంగా పనిచేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు కవిత, జగదీష్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై సూచనలు అందించారు. ప్రత్యేక కౌన్సెలింగ్ లో పలువురు ఉద్యోగులు నిపుణులతో తమ వ్యక్తిగత సమస్యలను చర్చించి సలహాలు పొందారు. కార్యక్రమంలో ఆకర్ష ఫౌండేషన్ చైర్మన్ డా. శంకరరావు, కలెక్టరేట్ నోడల్ అధికారి జి.జ్యోతి, సైకాలజిస్టులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలెక్టర్ కె. వెట్రిసెల్వి



**ఏలూరు, అక్టోబర్, 8 :** అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఈనెల 8వ తేదీ నుండి జిల్లాలో ఇంటింటికీ వెళ్లి, ఆ ఓటర్ల ప్రస్తుత స్థితిని పునఃపరిశీలిస్తారని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. 'ప్రత్యేక సమగ్ర సవరణ - 2026' భాగంగా నోటీసు దశలో (గైర్హాజరైన, స్థానచలనం చెందిన, మరణించిన లేదా ద్వంద్వ నమోదు కలిగిన) ఓటర్లు/అనర్హ ఓటర్ల స్థితిని పునఃపరిశీలించడం మరియు కొత్త ఓటర్లు/జాబితాలో చేరని ఓటర్ల నమోదు కోసం ఒక 'ప్రత్యేక కార్యక్రమాన్ని' చేపట్టాలని కమిషన్ నిర్ణయించిందన్నారు. తొలగించిన ఓటర్లను స్థితిని బిఎల్వోలు పరిశీలిస్తారని, తొలగించిన ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల్లో పరిశీలనకు ఉంచుతారన్నారు. ఈ సందర్భాలలో ఏదైనా ఓటరు పేరు పొరపాటున తొలగించబడినట్లు గుర్తిస్తే, వారికి 'ఫారం-6' నింపే అవకాశం కల్పించబడుతుందన్నారు. "అర్హులైన ప్రతి ఓటరు పేరును ఓటర్ల జాబితాలో చేర్చడం మరియు అనర్హుల పేర్లను తొలగించడం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. 'నిరంతర అప్‌డేషన్' ప్రక్రియ ద్వారా వారి పేరు ఓటర్ల జాబితాలో చేర్చబడుతుందన్నారు. .జిల్లాలో 2026 (ప్రత్యేక సారాంశ సవరణ) కింద తుది ఓటర్ల జాబితా 16.10.2026న ప్రచురించబడుతుందన్నారు. ఈనెల 16వ తేదీన ప్రచురించబడే తుది జాబితాలో పేరు లేని ఓటర్లు మరియు తదుపరి అర్హత తేదీలలో అర్హత సాధించే వ్యక్తులు, 'నిరంతర అప్‌డేషన్' సమయంలో తమ పేరు నమోదు కోసం 'ఫారం-6'ను సమర్పించవచ్చన్నారు.

## టీచర్ గా మారిన ఏలూరు కలెక్టర్ వెట్రి సెల్వి



**ఏలూరు/దెందులూరు, అక్టోబర్, 8 :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యా బోధన అందిస్తున్నామని, అందుకు తగిన విధంగా విద్యార్థులు కష్టంతో కాక ఇష్టంతో విద్య నభ్యసించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విద్యార్థులకు ఉద్బోధించారు. దెందులూరు మండలం సింగవరంలోని శ్రీ మావులేటి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన , విద్యార్థుల ప్రతిభ స్థాయిలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నదన్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలూ, యూనిఫామ్, బూట్లు, స్కూల్ బ్యాగ్ లు వంటివి ఉచితంగా అందిస్తూ, మధ్యాహ్న భోజనం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ క్లాస్ రూంలు, క్రీడా మైదానాలు, ల్యాబ్ లు, వంటి మౌలిక సదుపాయాలు అన్నీ ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన టీచర్స్ విద్యా బోధనా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందిస్తున్న చేయూతతో విద్యార్థులు విద్యపై దృష్టి కేంద్రీకరించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.
దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయి పెరిగిందన్నారు. ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయులు నిర్దేశించిన సమయానికి పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ సుమతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో 38 క్షయరహిత పంచాయతీలు



- క్షయరహిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి
- సీహెచ్‌వోలకు సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబర్ 08, 2026 :** దేశవ్యాప్తంగా క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో జోష్ (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్) కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా గురువారం ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో 38 గ్రామ పంచాయతీలను క్షయరహిత పంచాయతీలుగా గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ చేతులు మీదుగా ఎంపికైన 38 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు (సీహెచ్‌వోలు)లకు సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలను క్షయరహిత పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు వైద్య సిబ్బంది, యువత, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, చికిత్సను పూర్తిగా అందించడం, ప్రజల్లో టీబీపై అవగాహన కల్పించడం ద్వారా జిల్లాను క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.రమేష్, జిల్లా క్షయ నివారణ అధికారి డా. బి.భాను నాయక్, జిల్లా యువజన అధికారి ప్రదీప్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్, మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, జాతీయ క్షయ నివారణ కార్యక్రమం (ఎన్‌టీఈపీ) సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నాం కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

- ఓటర్ల జాబితాలు, ఎన్నికల సామగ్రి, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



**విజయవాడ, అక్టోబర్ 08, 2026 :** స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ తెలిపారు.
రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ... జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీఈవోలు, మున్సిపల్ కమిషనర్లు, జెడ్పి సీఈవోలు, డీపీవోలు,సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి కలెక్టరేట్ శ్రీ ఏపీఎస్ రెడ్డి హాల్ నుంచి హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఎన్నికల ముందు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ స్టేషన్లలో వసతులు, సిబ్బంది శిక్షణ తదితరాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు సన్నద్ధత, అవసరమైన సామగ్రి, పోలింగ్ స్టేషన్లలో అవసరమైన ప్రాథమిక వసతులు, ఎన్నికల సిబ్బంది శిక్షణను మరింత సులభతరం చేసేందుకు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ప్రి-పోలింగ్, పోలింగ్ రోజు, కౌంటింగ్, సిబ్బంది విధులు, బాధ్యతలకు సంబంధించిన మాడ్యూల్ వారీ శిక్షణ వీడియోలు, లింక్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీపీవో టి.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రైతులందరికీ రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ



కలెక్టర్ వెట్రి సెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

**ఏలూరు/దెందులూరు, అక్టోబర్, 8 :** మార్చి 2027లోగా జిల్లాలోని రైతులందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. దెందులూరు మండలం సింగవరంలో గురువారం దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ తో కలిసి పట్టాదారు పాస్ పుస్తకాలను కలెక్టర్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎటువంటి తప్పులు లేకుండా, 13 పటిష్టమైన భద్రతా ఫీచర్లతో పట్టా దారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామన్నారు. మార్చి , 2027లోగా జిల్లాలోని రైతులందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలనీ రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతీ నెల 20, నుండి 30 గ్రామాలలో రీసర్వే పనులను పూర్తిచేసి, తదుపరి నెలలో రాజముద్రతో కూడిన పటాదార్ పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఎటువంటి తప్పులేని, రాజముద్రతో ముద్రించిన పట్టాదార్ పాస్ పాస్ పుస్తకాల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతను తెలుసుకుని పట్టాదార్ పాస్ పాస్ పుస్తకాల పంపిణీని జిల్లా యంత్రాంగం నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈ సందర్భంగా సింగవరం పరిధిలో రెండు ఎకరాల ప్రభుత్వము ఉందని దాన్ని కొంత మంది ఆక్రమించారని పర్వతనేని రామకృష్ణ జిల్లా కలెక్టర్ దృష్టికి తేవడంతో దాని విచారణ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. ఏలూరు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ సుమతి, దెందులూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గారపాటి రామసీత, సీతంపేట బ్యాంక్ అధ్యక్షుడు యలమర్తి శ్రీనివాస్,మండల అధ్యక్షుడు నాగన్న బోయిన సత్యనారాయణ,
స్థానిక ప్రముఖులు పరసా వెంకట్రావు, పర్వతనేని రామకృష్ణ, బోడ్డేటి మో హన్ బాబు, ప్రభృతులు పాల్గొన్నారు.

## సరస్ మేళాకు సమగ్ర ఏర్పాట్లు..

- దేశం నలుమూలల నుంచి నుంచి 600 స్టాళ్ల వరకు ఏర్పాటు
- నాణ్యవంతమైన హస్తకళా, చేనేత ఉత్పత్తుల ప్రదర్శన
- స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, అక్టోబర్ 08, 2026 :** ఈ నెల 13వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జాతీయస్థాయి సరస్ అజీవిక మేళాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.
గురువారం సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎన్ఆర్ఎల్ఎం డైరెక్టర్ డా. మోలిశ్రీ, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులు సరస్ మేళాకు పున్నమి ఘాట్ వద్ద చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి 600 వరకు స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని.. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఒకే వేదికపై తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. హస్తకళా ఉత్పత్తులు, చేనేత ఉత్పత్తులను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయ కళలు, గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగర ప్రజలతో పాటు ఎన్టీఆర్ జిల్లా ప్రజలు, సందర్శకులు సరస్ మేళాను పెద్ద సంఖ్యలో సందర్శించి, వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. గౌరవ రాష్ట్రపతితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు కూడా హాజరవుతారని పేర్కొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం దసరా ఉత్సవాలతో పాటు విజయవాడ ఉత్సవ్, సరస్ మేళా.. ఇలా మూడు కార్యక్రమాలు ఒకేసారి జరగనుండటంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గౌరవ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా కార్యక్రమాల విజయవంతానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ,



ఆదాయ అవకాశాలను ప్రశంసించిన తెలంగాణ రైతులు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ, నమూనాలు, రైతులకు లభిస్తున్న ఆదాయ అవకాశాలను పరిశీలించిన తెలంగాణ రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి వ్యక్తం చేసిప్రశంసించారు. రైతుల విజ్ఞాన యాత్రలో భాగంగా రాష్ట్రంలో అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏ.పి.సి.ఎన్.ఎఫ్) విధానాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు తెలంగాణకు చెందిన సుమారు 50 మంది రైతుల బృందం గురువారం (08-10-26) ఎన్టీఆర్ జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది.
ఈ సందర్భంగా కంద్రపాడు గ్రామానికి చెందిన రైతు శ్రీ వెంకటప్ప రెడ్డి అభివృద్ధి చేసిన 5 అంచెల నమూనా, సమీకృత చేపల చెరువు, కూరగాయల నమూనా, బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ (బి.ఆర్.సి)లను తెలంగాణ రైతులు పరిశీలించారు. వివిధ పంటలను సమన్వయంతో సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలను తెలుసుకున్నారు. ఘనజీవామృతం, ద్రవజీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, కోడిగుడ్డు నిమ్మరస ద్రావణం, విత్తన గుళికల తయారీ విధానాలను తెలంగాణ రైతులు ప్రత్యక్షంగా పరిశీలించి, వాటి తయారీ, వినియోగంపై అవగాహన పొందారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఇన్‌పుట్లు స్థానికంగా అందుబాటులో ఉండటం, వాటి ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను ఎపీసీఎన్ఎఫ్ అధికారులు వివరించారు.
అనంతరం వత్సవాయి మండలం పోచవరం గ్రామంలోని శ్రీ ప్రభుదాసు నిర్వహిస్తున్న ఎనీ టైం మనీ (ఏ.టి.ఎం) నమూనా, శ్రీమతి ఆదిలక్ష్మి సాగు చేస్తున్న వరి ఏ-గ్రేడ్ నమూనా, శ్రీమతి డి. రాజలక్ష్మి సాగు చేస్తున్న పత్తి ఏ-గ్రేడ్ నమూనాలను కూడా తెలంగాణ రైతులు సందర్శించారు. వివిధ పంటల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అమలు, పంటల నిర్వహణ, రైతులకు లభిస్తున్న ఆదాయ అవకాశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను సంబంధిత అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీ జి. శ్రీనివాసరావు, బోనకల్లు మండల ఏ.డి.ఏ శ్రీమతి ఐ. వాణిశ్రీ, ముదిగొండ మండల ఏ.డి.ఏ శ్రీమతి పి. వాసవి రాణి, ఏ.ఓ శ్రీ వి. నాగేశ్వరరావు, ఏ.ఈ.ఓ శ్రీ టి. రమేష్, ఏ.ఈ.ఓ శ్రీ హరికృష్ణ, ఏ.ఈ.ఓ శ్రీ హుస్సేన్, శ్రీ సతీష్ - ఎన్.ఆర్.ఓ ఎన్.ఎఫ్.ఏ పాల్గొన్నారు.

## మహిళా ప్రాంగణంలో వివిధ కోర్సులకు ఆహ్వానం



**కామవరపుకోట, అక్టోబర్ 8 :** ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడి శ్రీ నందమూరి తారక రామారావు మహిళా ప్రాంగణంలో మహిళల కోసం వివిధ కోర్సులకు ఉచిత శిక్షణ తరగతులకు ఆహ్వానం పలుకుతున్నట్లు డిస్టిక్ ప్రాంగణం మేనేజర్ డాక్టర్ సుబేదా పర్వీన్ కోరారు. ప్రాంగణంలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, డేటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్, వృద్ధుల సంరక్షణ శిక్షణా కోర్సు, చైల్డ్ కేర్ టేకర్ కోర్సులు కలవని పర్వీన్ తెలిపారు ఆసక్తి కలిగిన వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కోసం అభ్యర్థులు వయస్సు 18 నుండి 45సంవత్సరాలు ఉండాలన్నారు. ప్రతి కోర్సును రెండు నెలల పాటు ఉచితంగా అందజేస్తామని, విధ్యార్హత మరిన్ని వివరాల కోసం 9000803414, 9849874734 నెంబర్లను సంప్రదించాలని డిస్ట్రిక్ట్ మేనేజర్ పర్వీన్ తెలిపారు.

## చిన్న వెంకన్న కు 1.27 కోట్ల రూపాయల ఆదాయం



**ఏలూరు జిల్లా, ద్వారకాతిరుమల, అక్టోబర్ 8,** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్నకు హుండీల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. గడచిన 15రోజుల కాలానికి గాను స్వామివారికి నగదు రూపంలో 1.27 కోట్లకి రూపాయల అధిక ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వెంద్ర త్రినాధరావు తెలిపారు. స్థానిక ప్రమోద కళ్యాణ మండప ఆవరణలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ జరిగిన ఈ లెక్కింపులో దేవాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ హుండీల లెక్కింపు లో స్వామివారికి 1,27,88,160 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో త్రినాధరావు తెలిపారు. అలాగే భక్తుల కానుకలు రూపేణా 167 గ్రాముల బంగారం 1, కేజీల 573 గ్రాముల వెండి లభించినట్లు, అలాగే విదేశీ కరెన్సీ సైతం ఈవో వేంద్ర త్రినాధ రావు తెలిపారు.

# 12 జట్లతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్..!




### టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుపై ఐసీసీ కీలక ప్రణాళిక

టీ20 క్రికెట్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఫ్రాంచైజీ లీగ్‌ల కారణంగా టెస్ట్ మ్యాచ్‌లకు తగినంత సమయం, ప్రేక్షకాదరణ దక్కడం లేదనే చర్చ కూడా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ టెస్ట్ క్రికెట్‌కు కొత్త ఊపు తీసుకురావాలనే ఆలోచనతో ఐసీసీ కీలక మార్పులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ లో తొమ్మిది జట్లు మాత్రమే పోటీపడుతున్నాయి. 2029--2031 సైకిల్‌లో మరో మూడు పూర్తి సభ్య దేశాలను చేర్చే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే జింబాబ్వే, ఐర్లాండ్, అఫ్గానిస్థాన్ జట్లు అడుగుపెట్టనున్నాయి. దీంతో క్రికెట్ చరిత్రలో తొలిసారి మొత్తం 12 పూర్తి సభ్య దేశాలు ఒకే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఇది కేవలం జట్ల సంఖ్య పెంచే నిర్ణయం మాత్రమే కాదు. టెస్ట్ క్రికెట్‌ను మరిన్ని దేశాలకు విస్తరించేందుకు కీలక అడుగుగా మారే అవకాశం ఉంది. మొదట బలమైన జట్లను ఒక విభాగంలో, మిగిలిన జట్లను మరో విభాగంలో ఉంచే 'టూ టైర్' విధానంపై ఆలోచన జరిగినట్లు సమాచారం. అయితే చిన్న దేశాలకు పెద్ద జట్లతో ఆడే అవకాశాలు తగ్గిపోవడం, ఆదాయంపై ప్రభావం పడే ప్రమాదం ఉండటంతో ఆ ఆలోచనను పక్కన పెట్టే అవకాశం కనిపిస్తోంది. కొత్త ప్రణాళిక ప్రకారం మొత్తం 12 జట్లు ఒకే డివిజన్‌లో కొనసాగుతాయి. ప్రస్తుతం పాయింట్ల కోసం కనీసం రెండు మ్యాచ్‌ల సిరీస్ అవసరం. అయితే చిన్న క్రికెట్ దేశాలకు రెండు లేదా మూడు టెస్టుల సిరీస్ నిర్వహించడం ఆర్థికంగా భారంగా మారుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా 2029 సైకిల్ నుంచి ఒక్క టెస్ట్ మ్యాచ్ మాత్రమే జరిగినా పాయింట్లు కేటాయించే అంశాన్ని ఐసీసీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇది జింబాబ్వే, ఐర్లాండ్, అఫ్గానిస్థాన్ వంటి దేశాలకు పెద్ద ఊరటగా మారవచ్చు. చిన్న దేశాల్లో టెస్ట్ మ్యాచ్‌లు నిర్వహించడం క్రికెట్ బోర్డులకు భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అవసరం కావచ్చు. 12 జట్లతో నిర్వహిస్తే మ్యాచ్‌ల సంఖ్య పెరుగుతుంది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న టీ20 ఫ్రాంచైజీ లీగ్‌లకు సమయం కేటాయించడం ఐసీసీకి పెద్ద సవాలుగా మారనుంది. 2029లో ఈ ప్రణాళిక అమల్లోకి వస్తే టెస్ట్ క్రికెట్ పరిధి మరింత విస్తరించనుంది. ఇప్పటివరకు చోటు దక్కని మూడు పూర్తి సభ్య దేశాలకు ప్రపంచ స్థాయి వేదిక లభిస్తుంది. చిన్న జట్లకు పెద్ద దేశాలతో టెస్ట్ ఆడే అవకాశాలు పెరగడం ద్వారా రెడ్ బాల్ క్రికెట్‌కు కొత్త ప్రేక్షకులు కూడా రావచ్చు. అయితే ఆర్థిక నిర్వహణ, ఆటగాళ్ల అందుబాటు, అంతర్జాతీయ షెడ్యూల్ వంటి అంశాలను ఐసీసీ ఎలా సమన్వయం చేస్తుందన్నదే అసలు ప్రశ్న. టీ20 క్రికెట్ వేగం పెరుగుతున్న సమయంలో టెస్ట్ క్రికెట్‌ను మరింత విస్తృతంగా తీసుకెళ్లాలనే ఆలోచనకు 12 జట్ల ప్రతిపాదన బలం చేకూర్చే అవకాశం ఉంది. జింబాబ్వే, ఐర్లాండ్, అఫ్గానిస్థాన్ వంటి దేశాలకు పెద్ద వేదిక లభిస్తే ప్రపంచ టెస్ట్ క్రికెట్ మరింత వైవిధ్యంగా మారుతుంది. ఐసీసీ ఈ ప్రణాళికను ఎలా ఖరారు చేస్తుందో చూడాలి. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం.. ఐదు రోజుల క్రికెట్‌కు కొత్త ఊపు తీసుకురావాలనే ప్రయత్నం మొదలైంది.

# రెండో టీ20కి టీమిండియా తుది జట్టు సిద్ధం




భారత్ -- వెస్టిండీస్ మధ్య ఐదు టీ20ల సిరీస్‌లో రెండో మ్యాచ్ శుక్రవారం, అక్టోబర్ 9న రాంచీలోని జేఎస్సీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనుంది. మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. లక్నోలో జరిగిన తొలి టీ20లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బౌలింగ్ చేసిన టీమిండియా వెస్టిండీస్‌ను 171 పరుగులకే పరిమితం చేసింది. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అద్భుతమైన సెంచరీతో భారత్‌కు విజయాన్ని అందించాడు. ఇప్పుడు అదే జోరును కొనసాగించాలని టీమిండియా చూస్తోంది. వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఇటీవలి టీ20ల్లో ఆశించిన స్థాయిలో రాణించలేదు. గత నాలుగు టీ20ల్లో అతడి ఖాతాలో కేవలం 29 పరుగులే ఉన్నాయి. లక్నోలోనూ 11 పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ కు అవకాశం ఇవ్వాలనే చర్చ మొదలైంది. అయితే గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని జట్టు యాజమాన్యం సంజూ సామర్థ్యం, అనుభవంపై నమ్మకం ఉంచుతోంది. తొలి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన నేపథ్యంలో వెంటనే అతడిని పక్కన పెట్టే అవకాశం తక్కువగా కనిపిస్తోంది. ఓపెనర్ అభిషేక్ శర్మ , మూడో స్థానంలో ఇషాన్ కిషన్ టీమిండియా బ్యాటింగ్‌లో కీలకంగా మారారు. 2026లో టీ20ల్లో అభిషేక్ 832 పరుగులు చేయగా, ఇషాన్ కిషన్ ఏకంగా 1042 పరుగులు సాధించాడు. అందుకే వీరిద్దరి స్థానాల్లో మార్పు ఉండే అవకాశం కనిపించడం లేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలి టీ20లో అద్భుతమైన సెంచరీతో తన ఫామ్‌ను చాటుకున్నాడు. రెండో మ్యాచ్‌లోనూ అతడిపైనే భారీ అంచనాలు ఉన్నాయి. అయ్యర్‌కు డిప్యూటీగా ఉన్న తిలక్ వర్మ 2026లో టీ20ల్లో 536 పరుగులు చేశాడు. భారత మిడిల్ ఆర్డర్‌కు అతడు కీలక బలంగా నిలుస్తున్నాడు. తొలి టీ20లో అరంగేట్రం చేసిన నామన్ ధీర్ మూడు వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించాడు. దీంతో అతడికి మరో అవకాశం దక్కడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. పవర్ హిట్టర్ శివమ్ దూబే కూడా జట్టులో కొనసాగనున్నాడు. 2026 టీ20ల్లో అతడు 532 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్ రేట్ 166.77గా ఉంది. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తొలి టీ20లో బంతితో కీలక పాత్ర పోషించాడు. రోవ్‌మన్ పావెల్, అకీల్ హొసైన్ వికెట్లు పడగొట్టడంతో పాటు షాయ్ హోప్, షమర్ స్ప్రింగర్ క్యాచ్‌లు అందుకున్నాడు. అలాంటి ప్రదర్శన తర్వాత రెండో టీ20లోనూ అతడి స్థానానికి ఎలాంటి ముప్పు కనిపించడం లేదు. జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేని పరిస్థితిలో అర్ష్‌దీప్ సింగ్ ( భారత పేస్ దళానికి ప్రధాన ఆయుధంగా కొనసాగనున్నాడు. తొలి టీ20లో కమీల్ పూరన్ వికెట్ కూడా అతడే తీశాడు. కుల్దీప్ యాదవ్ రవి బిష్ణోయ్ స్థానంలో జట్టులోకి వచ్చి వెంటనే ప్రభావం చూపించాడు. రెండు కీలక వికెట్లు తీసుకున్న అతడు రెండో టీ20లోనూ కొనసాగనున్నాడు. అయితే మయాంక్ యాదవ్ తొలి మ్యాచ్‌లో పెద్దగా ఆకట్టుకోలేదు. 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చాడు.

భారత బౌలర్లలో అతడి ఎకానమీ అత్యంత పేలవంగా ఉంది. అయినా మయాంక్‌ను జట్టు యాజమాన్యం మరోసారి పరీక్షించే అవకాశం ఉంది. అతడిని భారత క్రికెట్‌లో అత్యంత ఫాస్ట్ బౌలింగ్ ప్రతిభగా చూస్తున్న నేపథ్యంలో వెంటనే పక్కన పెట్టకపోవచ్చు. అతడి పోటీదారు ప్రిన్స్ యాదవ్ ఇటీవలే గాయం నుంచి కోలుకున్నాడు. లక్నో విజయంతో భారత్ ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఇప్పుడు రాంచీలో సిరీస్ ఆధిక్యాన్ని 2-0కి పెంచడమే లక్ష్యం.

సంజూ శాంసన్ తన ఫామ్‌ను తిరిగి అందుకుంటాడా? మయాంక్ యాదవ్ బౌలింగ్‌లో పుంజుకుంటాడా? శ్రేయస్ అయ్యర్ మరోసారి బ్యాట్‌తో మెరుస్తాడా? ఈ మూడు అంశాలు రెండో టీ20పై ఉత్కంఠను పెంచుతున్నాయి.

## పంజాబ్ కింగ్స్‌కు భారీ షాక్




పీఎల్ సీజన్‌కు ప్రారంభానికి ముందే పంజాబ్ కింగ్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు సపోర్టింగ్ స్టాఫ్‌లో నుంచి జేమ్స్ హోప్స్, బ్రాడ్ హెడిన్ తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ నిర్ణయాన్ని ఈ ఇద్దరూ ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్‌కు తెలియజేశారు. వీళ్ల నిష్క్రమణను పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ మేరకు 'థాంక్స్' పోస్టు చేసింది. 'మీ జ్ఞానానికి, అభిరుచికి డ్రెస్సింగ్ రూమ్‌లోని జ్ఞాపకాలకు ధన్యవాదాలు' అంటూ ఈ ఇద్దరితో ఉన్న ఫొటోను షేర్ చేసింది. గత రెండు సీజన్లలో రికీ పాంటింగ్ నేతృత్వంలో జేమ్స్ హోప్స్ ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించగా, బ్రాడ్ హాడిన్ ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేశారు. రెండేళ్ల కిందట దిల్లీ క్యాపిటల్స్ నుంచి హెడ్ కోచ్ రికీ పాంటింగ్‌తో పాటు హోప్స్ పంజాబ్ కింగ్స్ జట్టుతో చేరాడు. ఇక హాడిన్ 2022 సీజన్ నుంచి పంజాబ్‌తో ట్రావెల్ చేస్తున్నారు. అయితే పాంటింగ్ ఫ్రాంచైజీ హెడ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత హెడిన్‌ను అదే స్థానంలో కొనసాగించారు. ఈ కోచింగ్ స్టాఫ్ బృందం 2025లో పంజాబ్ ఫైనల్‌కు చేరడంలో కీలక పాత్ర పోషించింది. అయితే ఈ ఇద్దరూ ఐపీఎల్‌ను వీడి ఆస్ట్రేలియా డొమెస్టిక్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌కు వెళ్లనున్నారు. ఆసీస్ డొమెస్టిక్‌లోని క్వీన్స్‌లాండ్, బిగ్‌బాష్‌లోని బ్రిస్బేన్ హీట్ జట్లకు హాప్స్‌హెడ్ కోచ్‌గా నియమితులు కానున్నారని తెలిసింది. అలాగే న్యూ సౌత్ వేల్స్ జట్టుకు హెడిన్ ఛార్జ్ తీసుకోనున్నారు. అందుకే ఈ ఇద్దరూ ఐపీఎల్‌ను వదులుకుంటున్నారు. ఈ ఇద్దరి కంటే ముందుగానే పంజాబ్ బౌలింగ్ కోచ్ సైరాజ్ బహుతులే కూడా పంజాబ్ కింగ్స్‌ను విడిచిపెట్టాడు. అతడు భారత పురుషుల జట్టు కోచింగ్ బృందంలో చేరాడు. దీంతో తదుపరి ఐపీఎల్ సీజన్‌కు ముందు పాంటింగ్ సహాయక సిబ్బందిలో కనీసం మూడు ఖాళీలను పంజాబ్ ఫ్రాంచైజీ భర్తీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్‌కు సారథిగా ఉన్నాడు. అతడు కెప్టెన్సీ అందుకున్న తొలి సీజన్ (2025)లోనే జట్టును ఫైనల్ దాకా తీసుకెళ్లాడు. టైటిల్ ఫైట్‌లో ఆర్సీబీతో పంజాబ్ ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇక గత సీజన్ ప్రారంభంలోనూ పంజాబ్ అదరగొట్టింది. తొలి ఏడు మ్యాచ్‌ల్లో ఆరింట నెగ్గి ఈసారి కూడా ఫైనల్ చేరేలా కనిపించింది. కానీ ఆ తర్వాత ఆడిన ఏడింట్లో కేవలం ఒక మ్యాచ్‌లోనే విడయం సాధించింది. దీంతో ఆ జట్టు ఐదో స్థానానికి పరిమితమైంది.



## పంత్ స్థాయికి తగ్గట్టుగా ఆడడం లేదు

**- పంత్‌పై మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ విమర్శలు**

భారత స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్‌పై మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. అతడు టెస్టుల్లో రాణిస్తున్నప్పటికీ వైట్ బాల్ క్రికెట్‌లో మాత్రం స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నాడని అన్నాడు. ఇటీవల కాలంలో వన్డేలు, టీ20లు, చివరికి ఐపీఎల్‌లో కూడా ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ ఘోరంగా విఫలమయ్యాడని అభిప్రాయం వ్యక్తం చేశాడు. అయితే ప్రస్తుతం స్వదేశంలో వెస్టిండీస్‌తో భారత్ వైట్‌బాల్ సిరీస్‌లో తలపడుతున్న క్రమంలో అతడు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "వైట్ బాల్ క్రికెట్‌లో రిషభ్ పంత్ గణాంకాలు చూస్తే నాకు నిజంగా ఆశ్చర్యంగా ఉంది. వన్డే, టీ20, ఐపీఎల్ ఇలా ఎందులోనూ తన స్థాయికి తగ్గట్లుగా ఆడలేకపోతున్నాడు. ఇది నాకు ఒక చిక్కుముడిలా అనిపిస్తుంది. అందుకే నాకు ఓ అవకాశం లభిస్తే, అతడి సమస్యను పరిష్కరించాలని అనుకుంటున్నాను" అని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రాతో జరిగిన పాడ్‌కాస్ట్‌లో పార్థివ్ పటేల్ పేర్కొన్నాడు. అయితే ఇదే సందర్భంలో వన్డేల్లో రాణించాలంటే రిషభ్ ఏయే అంశాల్లో మెరుగుపడాలో పార్థివ్ పటేల్ ప్రస్తావించాడు. ఈ ఫార్మాట్‌లో కేవలం భారీ షాట్లు ఆడే పవర్ గేమ్ వర్కౌట్ కాదని అన్నాడు. అతడు విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ మాదిరిగా భారీ ఇన్నింగ్స్‌ను నిర్మించడం, అందుకు తగ్గ స్ట్రాటజీని పంత్ నేర్చుకోవాలని అభిప్రాయపడ్డాడు.

## కుర్రాళ్లు కుమ్మేస్తున్నారు: గేల్



ఆధునిక క్రికెట్‌లో యువ బ్యాటర్లు ప్రదర్శిస్తున్న నిర్భయమైన, దూకుడైన ఆటతీరును వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ ప్రశంసించాడు. కొత్త తరం క్రికెటర్లు ఎలాంటి జంకు లేకుండా మొదటి బంతి నుంచే దాడికి దిగడం వల్లే ఆటలో స్కోరింగ్ రేటు, పవర్ హిట్టింగ్ గణనీయంగా పెరిగాయని ఈ 'యూనివర్స్ బాస్' అభిప్రాయపడ్డాడు. ఈ మార్పు క్రికెట్‌కు సానుకూలమైన పరిణామమని పేర్కొన్నాడు. షార్జా క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ సందర్భంగా గేల్ మీడియాతో మాట్లాడాడు. "బౌలర్లు కాకుండా బ్యాటర్లు రికార్డులు బద్దలు కొడుతుండడం నాకు సంతోషంగా ఉంది. దీనికి కారణం, యువతరం ఇప్పుడు భయం లేని క్రికెట్ ఆడుతోంది. మొదటి బంతి నుంచే దాడి చేస్తున్నారు. ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడుతున్నారు. ఆట మారింది, ఆటగాళ్లు మారారు. పరుగులు చేయడానికి బ్యాటర్లు ఆకలితో ఉన్నారు. వారి నిర్భయమైన ఆటతీరు క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుంది" అని గేల్ వివరించాడు. ఇదే అంశంపై వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో బౌలర్ల కోణంలో స్పందించాడు. బ్యాటర్ల దూకుడు ఆటకు అద్భుతంగా మేలు చేస్తున్నప్పటికీ, బౌలర్లు ఈ కొత్త శకానికి అనుగుణంగా తమను తాము మార్చుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పాడు. "ప్రపంచవ్యాప్తంగా బ్యాటింగ్ తీరు చూస్తుంటే, ఇప్పటి ఆటలో నేను లేనందుకు సంతోషంగా ఉంది. బ్యాటర్ల నైపుణ్యాలు విపరీతంగా పెరిగాయి. ఈ మార్పులకు అనుగుణంగా బౌలర్లు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి, కొత్త ఆవిష్కరణలు చేయాలి" అని బ్రావో అన్నాడు. భవిష్యత్తులో వన్డేల్లో 400, 500 పరుగుల స్కోర్లు కూడా ఆశ్చర్యం కలిగించవని జోస్యం చెప్పాడు. వెస్టిండీస్ ఛాంపియన్స్ జట్టు యజమాని అజయ్ సేథి మాట్లాడుతూ.. ఒకప్పుడు గేల్, బ్రావో వంటి విండీస్ స్టార్లు దూకుడైన బ్యాటింగ్‌ను ఒక సంచలనంగా ప్రారంభిస్తే, అది ఇప్పుడు ప్రపంచవ్యాప్త ట్రెండ్‌గా మారిందని పేర్కొన్నారు. "వెస్టిండీస్ ప్రారంభించిన ఈ దూకుడైన బ్యాటింగ్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్నారు. విండీస్ క్రికెట్‌కు పర్యాయపదంగా మారిన నిర్భయమైన విధానం ఇప్పుడు అన్ని దేశాల జట్లలో కనిపిస్తోంది" అని అన్నారు.

# మళ్లీ వస్తున్న సేనాపతి..

## 'ఇండియన్ 3' వార్ మోడ్ ఆన్!




లోకనాయకుడు కమల్ హాసన్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఇండియన్ 3' నుంచి మేకర్స్ ఓ కీలక అప్‌డేట్ ఇచ్చారు. నేడు ఈ సినిమాకు సంబంధించిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు వెల్లడించాయి.నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సోషల్ మీడియా ద్వారా ఈ పోస్టర్‌ను పంచుకుంది. "సేనాపతి జీరో టాలరెన్స్‌తో తిరిగి వస్తున్నారు. 'ఇండియన్ 3' వార్ మోడ్‌లో పునరుజ్జీవనం" అనే క్యాప్షన్‌ను జోడించింది. దీంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.వాస్తవానికి 'ఇండియన్ 2' చిత్రీకరణ సమయంలోనే మూడో భాగానికి సంబంధించిన కీలక సన్నివేశాలను కూడా చిత్రీకరించారు. సినిమా నిడివి చాలా ఎక్కువగా ఉండటంతో కథను రెండు భాగాలుగా విడుదల చేయాలని దర్శకుడు శంకర్, కమల్ హాసన్ నిర్ణయించుకున్నారు. 'ఇండియన్ 2' కంటే మూడో భాగంపైనే తనకు ఎక్కువ ఆసక్తి ఉందని కమల్ హాసన్ గతంలోనే స్పష్టం చేశారు.1996లో వచ్చిన 'ఇండియన్' సంచలన విజయం సాధించడంతో దానికి సీక్వెల్‌గా 'ఇండియన్ 2'ను 2017లో ప్రకటించారు. అయితే, ఈ సినిమా ప్రయాణం అనేక అడ్డంకులను ఎదుర్కొంది. సెట్స్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో ముగ్గురు మరణించడం, ఆ తర్వాత కరోనా మహమ్మారి, దర్శక-నిర్మాతల మధ్య విభేదాల కారణంగా షూటింగ్ చాలాకాలం నిలిచిపోయింది. ఆ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు శంకర్, కమల్ తో పాటు లైకా ప్రొడక్షన్స్ ఆర్థిక సహాయం ప్రకటించింది.
అనంతరం రెడ్ జెయింట్ మూవీస్ రంగంలోకి దిగడంతో వివాదాలు పరిష్కారమై, చిత్రీకరణ తిరిగి ప్రారంభమైంది. ఎట్టకేలకు 'ఇండియన్ 2' పూర్తి చేశారు. ఆ సినిమా విడుదలైన రెండేళ్ల తర్వాత ఇప్పుడు 'ఇండియన్ 3'కి సంబంధించిన తాజా పోస్టర్ రావడంతో ఫ్రాంచైజీ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అవినీతిపై సేనాపతి చేసే యుద్ధాన్ని మరోసారి తెరపై చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# తెలంగాణ సంస్కృతికి దర్పణం పట్టిన దర్శక మేధావికి గౌరవం

**ప్రముఖ దర్శకుడు బి. నర్సింగరావుకు గౌరవ డాక్టరేట్**

**గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న 'మా భూమి' ఫేమ్**

**తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పారని నర్సింగరావుపై గవర్నర్ ప్రశంసలు**

**నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ విద్యపై దృష్టి పెట్టాలని గవర్నర్ సూచన**



ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు, కవి బి. నర్సింగరావు అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బుధవారం జూబ్లీహిల్స్‌లోని వర్సిటీ ప్రాంగణంలో వైభవంగా జరిగిన 27వ స్నాతకోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఆయన ఈ గౌరవ పట్టాను స్వీకరించారు.
తెలంగాణ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన 'మా భూమి' చిత్ర దర్శకుడిగా నర్సింగరావు సుప్రసిద్ధులు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని, సామాజిక వాస్తవికతను వెండితెరపై ఆవిష్కరించి, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన్ననలు పొందిన విశిష్ట సృజనశీలిగా నర్సింగరావును కొనియాడారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గవర్నర్.. విద్యార్థులకు డిగ్రీ, పీజీ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ పట్టాలతో పాటు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విధ్వంసక చర్యలకు కాకుండా, సమాజ శ్రేయస్సు మరియు పునర్నిర్మాణం కోసం వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉన్నత విద్యాసంస్థలు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ విద్యపై మరింతగా దృష్టి సారించాలని ఈ సందర్భంగా సూచించారు.
ఈ స్నాతకోత్సవంలో భాగంగా మొత్తం 23 మంది పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, ఒకరికి ఎం.ఫిల్ డిగ్రీని అందజేశారు. అలాగే, వివిధ యూజీ, పీజీ కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 38 మంది విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు.

# ఫేక్ న్యూస్, ఏఐ కంటెంట్.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కంగనా రనౌత్



ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన వ్యక్తిత్వ, ప్రచార హక్కుల పరిరక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫోటో, గొంతును వాణిజ్యపరంగా వినియోగిస్తున్నారని, ముఖ్యంగా తప్పుడు వార్తలు, కృత్రిమ మేధ సాయంతో సృష్టించిన కంటెంట్ ద్వారా తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం, ప్రతివాదులకు సమన్లు జారీ చేసింది.జస్టిస్ వికాస్ మహాజన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. కంగనా రనౌత్ తరఫున న్యాయవాది సాకేత్ సిక్రీ వాదనలు వినిపిస్తూ, ఆమె ప్రతిష్ఠను మసకబార్చే విధంగా ఉన్న పలు వెబ్ లింకులను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో కొన్ని యానిమేటెడ్ వీడియోలు, మీమ్స్ రూపంలో ఉన్నాయని, అవి వ్యంగ్య ధోరణిలో ఉన్నట్లు కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ప్రస్తుత దశలో వాటిని తొలగించాలని తాము ఒత్తిడి చేయడం లేదని కంగనా తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. దావాకు సంబంధించిన నోటీసులు ముందే అందడంతో, కొందరు ప్రతివాదులు ఇప్పటికే అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించారని ఆయన న్యాయస్థానానికి వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, కంగనా పిటిషన్‌పై ప్రతివాదులకు సమన్లు జారీ చేయడంతో పాటు మధ్యంతర ఉత్తర్వుల దరఖాస్తుపై నోటీసులు ఇచ్చింది. పిటిషన్ నుంచి కొందరు ప్రతివాదుల పేర్లను తొలగించిన నేపథ్యంలో, సవరించిన జాబితాను దాఖలు చేయాలని కంగనా న్యాయవాదిని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను 2027 ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా వేసింది.
ఇటీవల కాలంలో ప్రముఖులు తమ వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాలను ఆశ్రయించడం పెరిగింది. గతంలో అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, రజనీకాంత్, జాకీ ష్రాఫ్ వంటి అగ్ర నటుల విషయంలో ఢిల్లీ హైకోర్టు సానుకూల ఉత్తర్వులు ఇచ్చింది. వారి పేరు, గొంతు, సంభాషణలను అనుమతి లేకుండా వాడరాదని స్పష్టం చేసింది. ఈ క్రమంలో, తప్పుడు వార్తలు, ఏఐ-జనరేటెడ్ కంటెంట్ వంటి ఆధునిక సవాళ్లతో కంగనా దాఖలు చేసిన ఈ పిటిషన్ ప్రాధాన్యత సంతరించుకుంది.

# టైమ్ ట్రావెల్, పునర్జన్మ వంటి ఎలిమెంట్స్‌తో..



స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ తొలి సినిమాను కేవలం డెబ్యూ మూవీగా కాకుండా.. నందమూరి అభిమానులకు గుర్తుండిపోయే సినిమాగా డైరెక్టర్ వశిష్ట స్క్రిప్ట్ ను సిద్ధం చేస్తున్నారట. బింబిసారతో సోషియో ఫాంటసీని తనదైన శైలిలో చూపించిన వశిష్ట.. ఇప్పుడు మోక్షజ్ఞ కోసం కూడా అదే జోనర్ ను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈసారి మాస్ ఎలిమెంట్స్‌కు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారట. మోక్షజ్ఞ బాడీ లాంగ్వేజ్ కు తగ్గట్టుగా స్టోరీని డిజైన్ చేసి.. మొదట్లో సరదాగా ఉండే కుర్రాడిగా అతడి రోల్ చూపించనున్నట్లు సమాచారం. టైమ్ ట్రావెల్, పునర్జన్మ వంటి ఎలిమెంట్స్ కూడా స్టోరీలో కలిపినట్లు తెలుస్తోంది

# చిరంజీవి-శ్రీకాంత్ ఓదెల చిత్రంపై క్లారిటీ ఇచ్చిన నాని

**ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుందని, మరింత సమయం పడుతుందని స్పష్టీకరణ**



మెగాస్టార్ చిరంజీవి, 'ప్యారడైజ్' దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ పై నీలినీడలు కమ్ముకున్నాయి. నేచురల్ స్టార్ నాని సమర్పకుడిగా, నిర్మాతగా వ్యవహరించనున్న ఈ చిత్రం ఇప్పట్లో పట్టాలెక్కేలా కనిపించడం లేదు. ఈ సినిమాకు మరికొంత సమయం పడుతుందని, దీనిపై ఇంకా ఎలాంటి తాజా చర్చలు జరగలేదని నాని స్వయంగా స్పష్టం చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్న మెగా అభిమానులకు నిరాశే ఎదురైంది.ఇటీవల ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాని ఈ ప్రాజెక్ట్ ఆలస్యం కావడానికి గల కారణాలను వివరించారు. ది ప్యారడైజ్' సినిమా నిర్మాణం అనుకున్నదానికంటే ఎక్కువ సమయం తీసుకుందని, దీనివల్ల చిరంజీవి సినిమా షెడ్యూల్ దెబ్బతిందని తెలిపారు. "నిజానికి ఈపాటికి చిరంజీవి గారి సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉండాల్సింది. కానీ 'ది ప్యారడైజ్' ఆలస్యమవ్వడంతో కుదరలేదు. దీనిపై మేము ఇంకా కూర్చుని చర్చించుకోలేదు. దీనికి మరికొంత సమయం పడుతుంది" అని నాని స్పష్టం చేశారు. ఈలోగా చిరంజీవి కూడా కొన్ని ఇతర సినిమాలను పూర్తి చేశారని ఆయన పేర్కొన్నారు.2024 డిసెంబర్ లో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోనే 'అత్యంత వయొలెంట్ సినిమా'గా ఇది రానుందని ప్రచారం జరగడంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తుండటంతో ఈ కాంబినేషన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, చిరంజీవి, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డేట్లు తిరిగి సర్దుబాటు అయ్యాక మాత్రమే ఈ ప్రాజెక్ట్‌పై తదుపరి అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది.

# చరణ్ నెక్స్ట్.. టార్గెట్ ఫిక్స్



రామ్ చరణ్ తో సుకుమార్ సినిమా అంటే.. రంగస్థలం మూవీకి మించిన అంచనాలు కచ్చితంగా ఉంటాయి. ఇప్పుడు ఆ కాంబో మళ్లీ సెట్స్ పైకి వెళ్లేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సినిమా ఎప్పుడు మొదలు పెట్టాలి, ఎప్పటిలోగా పూర్తి చేయాలి, ఎప్పుడు రిలీజ్ చేయాలనే విషయంలో కూడా సుకుమార్ క్లియర్ స్ట్రాటజీతో ముందుకు వెళ్తున్నారనే టాక్ వినిపిస్తోంది. పెద్ది తర్వాత చరణ్ చేస్తున్న ఆ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ గ్రాండ్ గా నిర్మిస్తోంది. అయితే రంగస్థలం తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో మొదటి నుంచే భారీ హైప్ ఉంది. ఇప్పుడు ఆ సినిమాకు సంబంధించిన లాంచింగ్ పై ఇన్ఫర్మేషన్ బయటకు వచ్చింది. దసరా సందర్భంగా ఈ నెల 16 నుంచి 20 మధ్యలో సినిమా పూజా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దసరాకు చరణ్- సుకుమార్ సినిమా అఫీషియల్ గా మొదలయ్యే ఛాన్స్ ఉందన్నమాట. అయితే దీనిపై మూవీ టీమ్ నుంచి అనౌన్స్మెంట్ రావాల్సి ఉంది. లాంచింగ్ తర్వాత కూడా ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టాలని సుకుమార్ భావిస్తున్నారట. డిసెంబర్ నుంచి షూటింగ్ ప్రారంభించి.. నాన్ స్టాప్ గా షూటింగ్ కంటిన్యూ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. దాదాపు ఏడాదిలో సినిమాను పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారట. ఇక డిసెంబర్ లో షూటింగ్ మొదలై ఏడాదిలోపే సినిమా పూర్తయితే.. 2028లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మంచి ఛాన్స్ ఉంటుంది. అందులో కూడా 2028 సంక్రాంతి లేదా సమ్మర్ ను టార్గెట్ గా పెట్టుకున్నట్లు టాలీవుడ్ లో చర్చ జరుగుతోంది. అంటే సినిమా లాంచింగ్ నుంచి రిలీజ్ వరకు ముందుగానే ఓ టైమ్ లైన్ పెట్టుకుని టీమ్ వర్క్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రాజెక్టుపై అంచనాలు పెరగడానికి మరో రీజన్ సుకుమార్ గత సినిమాలే. పుష్ప ఫ్రాంచైజీతో పాన్ ఇండియా రేంజ్ లో తన మార్క్ చూపించిన ఆయన.. ఇప్పుడు చరణ్ మూవీని ఎలాంటి స్టోరీతో రూపొందిస్తారనేది ఇంట్రెస్టింగ్ గా మారింది. రంగస్థలంలో చరణ్ ను పూర్తిగా కొత్త యాంగిల్ లో చూపించిన సుకుమార్.. ఈసారి కూడా అలాంటి కొత్త ట్రీట్మెంట్ తో వస్తారా అనే చర్చ జరుగుతోంది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com